ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నల్లగొండ

: fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

7-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 219 పేజీలు: 8+16 వెల: 6.50

మూడేళ్లలో డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యం: అమిత్‌షా

ఇరాన్‌లో ఆయిల్‌టాంకర్ పేలుడు, 11 మంది మృతి

5

# వాడి వేడిగా అసెంబ్లీ

## నేటి నుంచి వర్షాకాల సమావేశాలు

### వెయ్యి రోజుల పాలన నేపథ్యంలో చర్చకు సిద్ధమైన అధికార, ప్రతిపక్షాలు

### సభను స్తంభింపజేసేందుకు బిఆర్ఎస్, బిజెపి వ్యూహం

### నేడు అసెంబ్లీ ముట్టడికి బిజెపి పిలుపు

### పరిసర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి. ఈసారి సమావేశాల్లో అధికార,విపక్షాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. వాడీ,వేడి వాదనలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాళేశ్వరంపై శాసనసభలో మాట్లాడాలని నిర్ణయించుకున్నామని బిఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు తెలిపారు. అన్ని విషయాల్లో విఫలమైనవారే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బూతులు తిడుతున్న సభకు కేసీఆర్ రానక్కర్లేదని తామంతా చెప్పామని, తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి వెనకాడమని హెచ్చరించారు. నెలపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను అడుగుతామని, కాంగ్రెస్ పార్టీ ద్రోహాలు, 22ఏ అంశంపై అసెంబ్లీలో నిలదీస్తామని పేర్కొన్నారు. శాసనసభ స్తంభింపజేసైనా విద్యార్థులకు న్యాయం జరిగేదాకా గట్టిగా ప్రశ్నించాలని డిసైడ్ చేశామన్నారు సోమవారం అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. తొలుత ఇందిరాపార్కు వద్ద ధర్నాకు ఆ పార్టీ శ్రేణులు అనుమతి కోరాయి. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో అసెంబ్లీ ఆవరణలో పోలీసులు భారీ భద్రత చేబట్టారు. ప్రజాసంఘాల ఆందోళనల నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా నిషేధాజ్ఞలు విధించారు. 4,5 రోజుల పాటు జరిగే వీలున్న సమావేశాల సందర్భంగా అసెంబ్లీ లోపల, వెలుపలా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూసేందుకు సాయుధ బలగాలను కూడా రంగంలో దించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు సర్కారు సమాయాత్తమవగా పోలీసులు అందుకు అనుగుణంగానే బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వర్షాకాల సమావేశాలు బడ్జెట్ సమావేశాలతో పోలిస్తే మామూలుగానే జరిగే వీలున్నా మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా అధికార పక్షం,

>>2



ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో కాంగ్రెస్ మహాధర్నాలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్. చిత్రంలో మంత్రి వివేక్, సీనియర్ నాయకులు విహెచ్ తదితరులు

## ఎమ్మెల్యే పదవికి కెసిఆర్ రాజీనామా చేయాలి

### కాంగ్రెస్ మహాధర్నా డిమాండ్

### అసెంబ్లీకి హాజరు కాకుండా వెయ్యి రోజులుగా జీతం తీసుకుంటున్న మాజీ సిఎం

### విహెచ్ నాయకత్వంలో ధర్నాలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, పలువురు మంత్రులు, నాయకులు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** వెయ్యి రోజులుగా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా, అసెంబ్లీకి హాజరు కాకుండా, నియోజకవర్గంలో పర్యటించకుండా ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో

>>2



## రేవంత్‌రెడ్డిది ధర్మపాలన

### సురేఖ, చిన్నారెడ్డి నాకు మంచి మిత్రులే: మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త:** ఎవరికి నేను వ్యతిరేకం కాదు కాంగ్రెస్‌కి అనుకూలం ఎవరిపై కక్షతో నేనునివేదిక ఇవ్వలేదు కొండా సురేఖ చిన్నారెడ్డిలతో నాకు ఎలాంటి విభేదాలు లేవునాకు వాళ్ళు మిత్రులే అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మల్లు రవి అన్నారు. ఆదివారం క్రమశిక్షణ కమిటీ గాంధీభవన్‌లో సమావేశమై ఇటీవల క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించిన

>>2

# ఇక జల యుద్ధానికి సిద్ధం

### అవసరమైతే లక్షమందితో పాదయాత్ర

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్

### కాళేశ్వరంపై అన్నీ దుష్ప్రచారాలే

### హామీల వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయండి

### పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఎర్రవెల్లిలో కెసిఆర్ భేటీ




ఆదివారం ఎర్రవెల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మాట్లాడుతున్న కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** తెలంగాణ ఉద్యమం సాగింది, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది, సాగునీరు తాగునీరు కోసమేనని, తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టులపై చేసినవి దుష్ప్రచారాలనీ,కుట్రపూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో స్పష్టమైపోయిందని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. సాగు నీటివిషయంలో తెలంగాణకుజరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్‌ప్రభుత్వం మీద జల యుద్ధానికి సిద్ధం కావాలని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పార్టీలోని ఇతర ముఖ్య నేతలతో కలిసి కూర్చొని చర్చించి త్వరలోనే ప్రత్యక్ష కార్యాచరణకు విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు. సోమవారం

>>2

## తుక్కుగూడలో నర్సు హత్యపై మేజిస్ట్రీరియల్ విచారణ

### ముఖ్యమంత్రి ఆదేశం

### ఫాస్ట్ ట్రాక్ కోర్టులో దర్యాప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** నగర శివార్లలోని తుక్కుగూడలో నర్సుగా పని చేస్తున్న యువతిపై జరిగిన హత్యాచార ఘటనపై మేజిస్ట్రీరియల్ విచారణకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సర్కారు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులో నిందితుడికి త్వరిగతిన శిక్ష పడేందుకు, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిగేలా చూడాలని పోలీసులను సిఎం ఆదేశించారు. ఈ కేసులో సాక్ష్యాలను పక్కాగా సేకరించాలని. ఫోరెన్సిక్ ఆధారాలను ఎక్కడా తప్పిపోకుండా చూడాలని సిఎం ఆదేశించారు. పోలీసులు, న్యాయ విభాగాలు

>>2



## ప్రాణాలు తీసిన కల్తీ మద్యం

### మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో 12 మంది మృతి

### మరో 25 మందికిపైగా తీవ్ర అస్వస్థత

**సాగర్ (ఎంపి), సెప్టెంబరు 6:** మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం పెను విషాదాన్ని నింపింది. అనుమానాస్పద విషపూరిత మద్యం సేవించి 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ప్రభావిత గ్రామాల్లో వైద్య పరీక్షలు ప్రారంభించి, ముందుజాగ్రత్త చర్యగా పలు

>>2

## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

### ఇహెచ్ఎస్ అమలులో రాజీలేదు

### ట్రస్ట్ బోర్డు సభ్యులతో డి.సిఎం భట్టి సమావేశం



ఆదివారం ఇహెచ్ఎస్‌పై సమీక్షలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోంది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వసించే ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్పష్టంగా చెప్పారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్ లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన హెల్త్ కార్డు పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమవారేనని, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు చేసిందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం ఆలోచన చేసి తీసుకొచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈహెచ్ఎస్ పథకంలో ఇప్పటికే 354 ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా, మరికొన్ని ఆసుపత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చినట్లు ఆయన చెప్పారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. హెల్త్ కార్డులు జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ అషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులకు ఆయన చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలన్న స్పష్టమైన సంకల్పంతో ప్రజాప్రభుత్వం ఉందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పదేళ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని హెల్త్ కార్డు పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగులఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా, కమిటెడ్‌గా ఉందన్నారు. హెల్త్ కార్డు పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి

>>2

## జలజగడంపై నేడు ఢిల్లీలో భేటీ

### పాల్గొననున్న తెలుగు రాష్ట్రాల నీటిపారుదల అధికారులు

### కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** కృష్ణా,గోదావరి నది జలాల పంపిణీలో తెలుగురాష్ట్రాల మధ్య తరుచుగా తలెత్తుతున్న వివాదాల పరిష్కారం కోసం కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ చొరవ తీసుకొంది. జలవివాదాల సమసన్వయ సంఘం సమావేశంలో ఇరు రాష్ట్రాల ఇంజనీరింగ్ అధికారులతో పాటు కృష్ణా,గోదావరి నది యాజమాన్య బోర్డు అధికారులతో జలవివాదాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న నది జలాలవివాదం ప్రాజెక్టుల నిర్వహణ సమస్యల పరిష్కారంకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ జనవరిలో ఏర్పాటు చేసిన కమిటి రెండో సమావేశం సోమవారం ఢిల్లీ జరుగనుండటంతో ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు ఇప్పటికే ఢిల్లీచేరుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు అంశాలను ఎంజెండాలో ప్రతిపాదించింది. జలశక్తి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం సిడబ్ల్యుసి చైర్మన్ అధ్యక్షతన జరుగుతోంది. రెండు రాష్ట్రాల నీటిపారుదల/జల వనరుల శాఖల కార్యదర్శులు పాల్గొననున్నారు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్ఎంబి) ఆమోదం లేకుండానే గతనెల 26న సాయంత్రం నాగార్జునసాగర్ కుడి కాలువకు ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా నీటిని విడుదల చేయడంతో రెండు రాష్ట్రాల మధ్య మంచినీటి వివాదం నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీనికి ప్రతిగా తెలంగాణ కూడా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. ఆరోజున పోటాపోటీనా కుడి కాలువ నుంచి 7,380 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి తెలంగాణ 2,070 క్యూసెక్కుల నీటిని తీసుకుంటోంది. జనవరి 30న జరిగిన సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలోని జలశక్తి కమిటీ మొదటి సమావేశంలో, తదుపరి

>>2



3

పబ్‌లో అర్ధరాత్రి బాహాబాహీ

జూబ్లీహిల్స్‌లోని పబ్‌లో ఇరువర్గాల హంగామా

ఒక వర్గంలో ఎంపి సోదరుడు



3

ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్ భవనం

ఇద్దరు మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు



5

కొత్త మ్యాప్‌కు కొంత వరకే మద్దతు

కొన్నిటిని అంగీకరించం: భారత్



యుపి కాన్పూర్ పరిధిలోని హిర్నీ గ్రామంలో భారీ వర్షానికి ఓ ఇల్లు కూలిపోవడంతో శిథిలాలను తొలగిస్తున్న స్థానికులు

# నేడు ఢిల్లీలో భేటీ

>> చర్చల కోసం రెండు రాష్ట్రాలు సపోర్టింగ్ డేటాతో పాటు సవివరమైన ఎజెండా అంశాలను సమర్పించాలని నిర్ణయించారు. అయితే, కమిటీ కార్యాలయం గురించి అనేక రిమైండర్‌లు ఉన్నప్పటికీ, రెండు రాష్ట్రాలు ఇంకా తమ వివరణాత్మక ఎజెండాను పంపలేదు. తదుపరి చర్యలపై చర్చించేందుకు రెండు రాష్ట్రాల నుంచి నలుగురు అధికారులు, కెఆర్‌ఎంబి, జిఆర్‌ఎంబి, ఎన్‌డబ్ల్యుడిఎ, సిడబ్ల్యుసి అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ప్రాణహిత మీద ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజీకి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర సమస్యలపై చర్చించేందుకు సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి దాని ఛైర్మన్ అధ్యక్షత వహించారు. తెలంగాణ మహారాష్ట్రలోని జలవనరుల శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు, మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య సమావేశం నిర్వహించి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని కోరుతూ సిఎం రేవంత్ రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ తర్వాత ప్రధానమంత్రి కార్యాలయం ఈ విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు సూచించింది. తదనంతరం, ఆగష్టు 5న, రెడ్డి అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించి, ప్రాజెక్టును సులభతరం చేయడానికి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. తెలంగాణ అంగీకరించిన బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలన్నది చర్చించారు. సెప్టెంబరు 1న జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాలు, సిడబ్ల్యుసి ప్రతిపాదనకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి, బ్యారేజీపై ముందుకు వెళ్లే మార్గాన్ని అన్వేషించేందుకు అవకాశం కలిగిందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తూ సంతృప్తితో ఉంది.

# వాడి వేడిగా అసెంబ్లీ

>> ప్రతిపక్షాల మధ్య హోరాహోరీగా పోరు జరిగే అవకాశాలు వున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు ముందు బిఆర్‌ఎస్‌తో పాటు బిజెపి సర్కారుపై అనేక ఆందో ళన కార్యక్రమాలను చేబట్టడం గమనార్హం. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమీప ప్రాంతంలో ప్రతిపక్ష పార్టీలు ధర్నాలు చేయడం వీలైతే శాసనసభను ముట్టడించేందుకు ప్రయత్నించే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ వద్ద రక్షణ కోసం మూడంచల భద్రత ను ఏర్పాటు చేశారు. ఈ భద్రత ఇదివరకు ఏర్పాటు చేసిందే అయినా దీనిని మరింత పటిష్టం చేశారు. ఇందులో భద్రతా బలగాల రాకపోకల ప్రత్యేకంగా ఓ మార్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో సోమవారం నుంచి ధర్నాచౌక్, ఇందిరా పార్క్ వద్ద ముందుగానే ఆ ఒక్షలు విధించారు. ఇక్కడ భారీగా పోలీసులను మొహరించారు. అసెంబ్లీ లోపలకు కేవలం శాసనసభ్యులు, అనుమతులు వున్న అధికారులు, మీడియా సిబ్బంది, విధి నిర్వహణలో వున్న పోలీసులు మినహాయించి ఇతరులు రాకుండా చూడాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ భవనాన్ని పోలీసులు ఇప్పటికే తమ అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నుంచి మొదలుకానున్న సమావేశాల కోసం లోప ల, వెలుపల పెద్ద సంఖ్యలో సాయుధ బలగాలను మొహరించారు. సమావేశాలు జరిగే సమయంలో ఆందోళనకారులు అసెంబ్లీ వైపు రాకుం డా వుండేందుకు నాంపల్లి, రవీంద్ర భారతి చౌరస్తా, ఇక్బాల్ మినార్ చౌరస్తా, పబ్లిక్ గార్డెన్ చౌరస్తా, బాబు జగజీవన్ రాం చౌరస్తా, బషీర్‌బాగ్ చౌర స్తా, ఏఆర్ పెట్రోల్ బంకు చౌరస్తాతో పాటు సచివాలయం, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పోలీసులను మొహరించారు. ఎక్కడైనా తేడావచ్చి ఆందోళనకారులు దూసుకువస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ అయ్యా యి. ఈ సమావేశాలు సాఫీగా సాగేందుకు చేబట్టిన భద్రతా ఏర్పాట్లపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ సహా ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పర్య వేక్షిస్తున్నారు.

# మేజిస్టీరియల్ విచారణ

>>సమన్వయంతో పనిచేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో బాధి తురాలి కుటుంబానికి అండగా వుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసువిచారణలో జాప్యంలేకుండా చూడాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఈ కేసులో నేరానికి పాల్పడిన వ్యక్తికి చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ జరగాలని సీఎం అదేశించారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# గవర్నర్‌తో కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు6:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కేంద్ర మాజీ మంత్రి అశ్విని కుమార్ చౌబే ఆదివారం లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో మాజీ కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే వివిధ అంశాలపై చర్చించారు.

# ప్రాణాలు తీసిన కల్తీ మద్యం

>> మద్యం దుకాణాలను సీల్ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత మంత్రి, అధికారులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇలాంటి వాటిని మా ప్రభుత్వం ఎంతమాత్రం సహించదని ఆయన మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మరణాల నేపథ్యంలో జిల్లాలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "బాంబే విస్కీ" పేరుతో ఓ నకిలీ బ్రాండ్‌ను విక్రయిస్తున్నారని, దీనిపై ఓ మద్యం కాంట్రాక్టర్ ఇటీవలే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానిక కథనాలు పేర్కొంటున్నాయి. నాలుగు రోజుల క్రితం లైసెన్స్ పొందిన మద్యం కాంట్రాక్టర్లు సైతం ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో నకిలీ మద్యం అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురైన వారిలో తీవ్రమైన లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. శరీరం నీలంగా మారడం (సైనోసిస్), కండరాలు బిగుసుకుపోవడం వంటివి గమనించినట్లు చెప్పారు. ఇది మిథైల్ ఆల్కహాల్ పాయిజనింగ్ కావచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ దేవేష్ పటేరియా తెలిపారు. ప్రస్తుతం 910 మంది మరణించినట్లు మాకు సమాచారం ఉంది. మా వైద్య బృందాలు మూడు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత 24 నుంచి 48 గంటల్లో మద్యం సేవించి వాంతులు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి రావాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నౌరా, ఘుగ్రు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు ఆ ప్రాంతంలోని ఆరు మద్యం దుకాణాలను సీల్ చేసి, అనుమానాస్పద మద్యం నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. అసలు ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు, పరిపాలన యంత్రాంగం దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు అందిన తర్వాతే మరణాలకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

**07-09-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం, శ్రావణం మాసం, దక్షిణాయణం, వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,**
తి. ఏకాదశి సా.5.05. న. పునర్వసు సా.6.14
వ.ఉ.7.03 - ఉ.8.33. 2) రా.1.43 - రా. 3.13
దు.1.మ.12.24 -మ. 1.13. 2) మ.2.58 - మ.3.47
రాహు.ఉ.7.30-ఉ.9.00.
శుభ స. ఉ.5.00 - ఉ. 6.00.

## వార్తాఫలం

**మేషం :** పనులు నత్తనడకన సాగుతాయి, ఇంటా బయటా చికాకులు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృషభం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా వుండండి. క్రయవిక్రయాలలో లాభాలు.

**మిథునం :** విందు, వినోదాల్లో చురుకుగా సాగుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వివాహ యత్నాలు సాగిస్తారు.

**కర్కాటకం :** పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**సింహం :** శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమిస్తారు. ఋణాలు కొంత వరకు తీరుస్తారు.

**కన్య :** రాబడి కంటే ఖర్చులు అధికంగా వుంటాయి. పనుల్లో ఆటంకాలు కొంత వరకు తొలగుతాయి. ఆరోగ్య సమస్యలు కొంత వరకు తీరును.

**తుల :** కొత్తవ్యక్తులు పరిచయమై నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృశ్చికం :** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారదశ చేరుకుంటాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. వస్తు సేకరణ.

**ధనుస్సు :** ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్థివృద్ధి చెందుతుంది. పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు.

**మకరం :** కుటుంబసభ్యులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగుతాయి. ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం. శ్రమాధికం.

**కుంభం :** కొత్త వ్యక్తులు పరిచయమై నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ముఖ్యవ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన వస్తు సేకరణ.

**మీనం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇక జల యుద్ధానికి సిద్ధం

>> నుండి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో అధినేత కేసిఆర్ బిఆర్‌ఎస్‌ఎల్పి సంయుక్త సమావేశాన్ని ఆదివారంఎర్రవెల్లి లో నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సమస్యలపై చర్చా వేదికగా కాకుండా బూతు కూతలకు వేదికగా మార్చిందంటూ కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీ సభ్యులను సభలో తూలనాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాన్ని ఉభయ సభల్లో తిప్పి కొట్టాలని పార్టీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లకు అధినేత కేసిఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. మేడిగడ్డ దగ్గర చిన్న రిపేర్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల్లో రైతాంగం పంటలు పండించుకుంటారని, మరి ఎందుకు ఆ ప్రయత్నం చేస్తలేరో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాలేశ్వరం పై ఇదే పద్ధతిలో నిర్లక్ష్యం వహిస్తే, అన్యాయానికి గురవుతున్న రాష్ట్ర రైతాంగానికి సాగునీటి కోసం తానే స్వయంగా లక్షలాది మందితో కార్యాచరణ ప్రకటిస్తానని, సాగునీటి కోసం తిరిగి మరో యుద్ధానికి సిద్ధమోదామని కేసీఆర్ పిలుపు నిచ్చారు.

నా చావు కోరుతూ పదే పదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే రేవంత్ రెడ్డి బూతు పురాణం. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా? అని కెసిఆర్ వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలను, హామీలను వెయ్యి రోజులైనా అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందిందో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. పేద ప్రజల సంక్షేమం మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నదనే విషయాన్ని ఉభయ సభల్లో నిలదీయాలని ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

గ్రామాలు పట్టణాల్లోని పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల వివాహాలు, దవాఖాన ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తమ భూమిని అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు గోసపడుతున్నారనిచ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య మీద ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కెసిఆర్ స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీళ్లు వున్నా తెలంగాణ రైతాంగానికి ఎందుకు విడుదల చేయట్లేదనే విషయం మీద ప్రభుత్వాన్ని పట్టు పట్టాలని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, మిషన్ భగీరథ వంటి తాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసి, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చకపోవడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలి అని కెసిఆర్ దుయ్యబట్టారు. ఇదే విషయాన్ని సభాముఖంగా నిలదీయాలన్నారు.

నిరుపేదల పిల్లలు ఉన్నత చదువులు చదువుతూ, వారి భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకునే క్రమంలో అమలు చేసిన ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం పట్ల కెసిఆర్ మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపుల పై విద్యార్థుల పక్షాన అసెంబ్లీ వేదికగా పోరాడాలన్నారు. పాలిటెక్నిక్ విద్య ను భ్రష్టు పట్టించే విధంగా జీవో 97ను తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని సభ్యులకు కేసీఆర్ స్పష్టం చేశారు.

సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు, వృత్తి నైపుణ్యాన్ని సొంతం చేసుకుని భవిష్యత్తు ఉపాధిని సంపాదించుకుంటారని, అట్లా పలు రంగాలకు సంబంధించిన సాంకేతిక వృత్తి విద్యను అందించే పాలిటెక్నిక్ ను స్వార్థ ప్రయోజనాల కోసం ఫణంగా పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలన్నారు. తెలంగాణ సిరుల వెలుగు సింగరేణి గనుల్లో అవినీతి పెచ్చు మీరిందని, సింగరేణి కుంభకోణాలకు నెలవుగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఉభయసభల్లో పార్టీ సభ్యులు ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వ భూములను భవిష్యత్తు తరాల అవసరాలకు ఏమాత్రం మిగిల్చకుండా, తమ ఇష్టా రీతిన అక్రమ అమ్మకాలు చేపడుతున్న ప్రభుత్వ చర్యలను నిలదీయాలన్నారు.

సజావుగా నడుస్తున్న మెట్రో రైలు నిర్వహణను అనాలోచిత విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తన చేతిలోకి తీసుకున్నదని, తద్వారా రాష్ట్ర ఖజానా పై విపరీతమైన భారాన్ని పోవడమే కాకుండా నిర్వహణ చేతగాని పరిస్థితిలోకి నెట్టివేయబడిందని, ఇటువంటి తప్పుడు నిర్ణయాల మీద ఉభయ సభల్లో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలనీ పార్టీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు.

విద్యా రంగంలో అనాలోచిత నిర్ణయాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే కుట్ర చేస్తూ, రాష్ట్ర విద్యా విధానానికి విఘాతం కలిగిస్తున్నారనీ కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో విద్యా విధానం క్షీణించడం పట్ల అసెంబ్లీ, మండలి వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని అధినేత దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయనీ, శాంతి భద్రతల సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిలదీయాలన్నారు. దాదాపు 3 గంటల పాటు సాగిన బిఆర్‌ఎస్‌ఎల్పీ సంయుక్త సమావేశంలో, రాష్ట్ర ప్రజల సంక్షేమం రాష్ట్ర ప్రగతి పరిస్థితిపై కేసీఆర్ లోతుగా చర్చించారు. ప్రభుత్వ పనితీరుపై అసెంబ్లీ సమావేశాల్లో నిలదీయాలని అధినేత కెసిఆర్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ సమావేశాలను 15 రోజుల పాటు నడపాలి

## బిజెఎల్పీ సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి, రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కీలకవ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపడానికి సీఎం రేవంత్ ప్రభుత్వం భయపడుతుందని విమర్శించారు. అసెంబ్లీలో చర్చించే అంశాలపై బీజేఎల్పీ ఆదివారం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సోమవారం నుంచి జరగనున్న సమావేశాల్లో మాట్లాడే అంశాలపై చర్చించామని మహేశ్వర్ రెడ్డి అన్నారు. సభ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అన్నివర్గాల ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు ఇంకా అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, అవినీతి అక్రమాలపై ఈ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు. 15 రోజులు సభను నడపాలని తాముడిమాండ్ చేస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తామని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



బీహార్‌లో ఆదివారం గంగా నది నీటి మట్టం పెరగడంతో పాట్నాలో నీట మునిగిన పలు కాలనీలు

# కెసిఆర్ రాజీనామా చేయాలి

>> ఎంపీ ఎం.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో, సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధులుగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామిక దేశంలో ప్రతిపక్ష నాయకులు బాధ్యతగల పదవిలో ఉన్నట్లు అని, అధికారం ప్రజలు ఇచ్చే కానుక అని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం వారికి ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలుచేయటం జరుగుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం కూతలు కూసి, మొఖం చాటేశారని, కాంగ్రెస్ ధ్యేయం లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఆదిశగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో వైద్యం అంటే కార్పొరేట్ సెక్టార్ అని, కేటీఆర్‌కు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. గడిచిన రెండు సంవత్సరాలలో 78వేల కోట్లు విదేశీ పెట్టుబడులు గ్లోబల్ సమ్మిట్‌తో ఐదు లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావటం జరిగిందని, ఇంకో రెండున్నర సంవత్సరాలలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చి తీరతామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయని, ప్రజా పాలన ప్రభుత్వంలో 70వేల మందికి పైగా సామాన్యులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీలను కేసీఆర్ విస్మరించారని, మా హయాంలో గద్దర్ పేరిట అవార్డులు, జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరించి, గౌరవించుకోవటం జరిగిందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ నినాదం మేరకు సీఎం రేవంత్, మంత్రుల ఆధ్వర్యంలో కుల సర్వే నిర్వహించామని, కులసర్వేలో దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. జీతం తీసుకుంటూ ఫాంహౌస్‌కు పరిమితమైన ప్రతిపక్ష హోదాని అపహాస్యం చేస్తున్న కేసీఆర్ ప్రతిపక్ష నేతగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఏమైనా లోపాలుంటే ఎత్తి చూపాలి కానీ, అసత్యాలు ప్రచారం చేయటం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని, భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని, అధికారం మళ్లీ కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటలలోపే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. రేషన్ కార్డులు మంజూరు చేశామని, సన్న బియ్యం ఇస్తున్నామని, రైతు ఋనమాఫీ, రైతు భరోసా, సన్న వడ్ల బోనస్, 72వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఆఫీస్‌కి రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తారని, కానీ మన మాజీ ముఖ్యమంత్రి వెయ్యి రోజుల పాలనలో ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదని, ప్రతిపక్ష పాత్ర పోషించలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పాటును అవమానించిన బీజేపీ తెలంగాణకు ఏం తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మన కార్యకర్తలు మన ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ పథకాలు కళ్లులేని టీఆర్‌ఎస్ చూడలేకపోతోందని, కళ్లుండీ బీజేపీకి కూడా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కనిపించటం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంలో కేవలం కాంగ్రెస్ వాళ్లు మాత్రమే ప్రయాణిస్తున్నారా, బీజేపీ వాళ్లు, బీఆర్‌ఎస్ వాళ్లు ప్రయాణించటం లేదా, సన్నబియ్యం కాంగ్రెస్ వాళ్లకి మాత్రమే ఇస్తున్నామా, ఉచిత విద్యుత్ అర్హులైన ప్రజలందరూ వాడుకోవటం లేదా అని ప్రశ్నించారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ వెయ్యి రోజుల నుంచి ప్రతిపక్ష నేత కేసీఆరన అసెంబ్లీకి రాలేదని, ప్రజా ధనాన్ని వృధా చేసిన కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెయ్యి రోజులలో ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు శ్రీలతా శోభన్‌రెడ్డి, రమ్యారావు, వివిద జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వెంటనే హస్తినకు రండి

## సిఎం రేవంత్‌కు అధిష్ఠానం పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినిహుటాహుటిన ఢిల్లీకి రావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశించినట్లు సమాచారం. అయితే సోమవారం నుంచి అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు ప్రారంభంకానున్నందున, సమావేశాలు వాయిదా పడిన తర్వాత ఢిల్లీకి వెళ్ళేందుకు ఆయన సమాయత్తమవుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశాలు ముగిసిన వెంటనే మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఢిల్లీకి రావాల్సిందిగా ముఖ్యమంత్రికి అధిష్టానం నుంచి పిలుపు రావడంతో మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అధిష్టానం చర్చలు జరపనున్నది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు కేంద్ర మంత్రులను కలిసి పెండింగ్ పనుల విషయంలో చర్చించి, ఆ మంగళవారం హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలుస్తోంది.

# నేడు ప్రధాని మోడీ అధ్యక్షతన కేబినెట్ భేటీ

## కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంచనాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని గత కొన్ని రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ సోమవారం మంత్రులతో కీలక భేటీ నిర్వహించబోతున్నారు. మంత్రుల పనితీరుపై చర్చించే అవకాశం ఉంది. మంత్రిత్వ శాఖల పనితీరు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, మంత్రులకు అప్పగించిన బాధ్యతల్లో పురోగతిపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమీక్షల తర్వాత కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సోమవారం జరిగే తొలి దశ సమావేశంలో విద్య, సామాజిక న్యాయంసాధికాతర, వ్యవసాయం వంటి శాఖలకు సంబంధించిన మంత్రులు పాల్గొననున్నట్లు సమాచారం. ఆయా శాఖల పురోగతి, చేపట్టిన కార్యక్రమాల అమలు, పనితీరుకు సంబంధించిన నివేదికలను మంత్రులు ప్రధానికి సమర్పించనున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఒక్క సమావేశంతోనే మంత్రుల సమావేశాలు ముగిసే అవకాశం లేదు. రాబోయే రోజుల్లో ఇతర మంత్రిత్వ శాఖలకు చెందిన మంత్రులతో ఇలాంటి సమావేశాలు పలు దశల్లో జరిగే అవకాశం ఉంది. సోమవారం జరిగే భేటీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై మరిన్ని ఊహాగానాలను పెంచుతోంది.

# ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

>> అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శ సంజయ్ జాజు, జేఏడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మహేష్ దత్ ఎక్కా, హెల్త్ అండ్ మెడికల్ ప్రిన్సిపల్ సెక్రెటరి క్రిస్టీనా, హోమ్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ మోగితా రాణా, ఈహెచ్‌ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగసంఘాలనాయకులు, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డిది ధర్మపాలన

>> వారికి నోటిసులు జారీచేసింది. అనంతరం మల్లు రవి విలేఖరులతో మాట్లాడుతూ ఆదిలాబాద్ సంఘటనలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రెడ్డిలకు గజ్వేల్ నియోజక వర్గంలో ఇంచార్జ్ నర్సా రెడ్డి జూపల్లి మల్లారెడ్డికు..పెద్దపల్లి ఎంపీ వంశీ కారు మీద దాడి చేసిన ఫిర్యాదులో గడ్డం త్రిమూర్తి, అక్క వెంకటేశ్వర్లు, అంకత శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్ సృజన్, ఆకుల ప్రసాద్ తదితరులు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారుజ క్రమశిక్షణ కమిటి నోటిసులు జారీచేసిన ఆరుగురు వారం లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఆదిలాబాద్ ఇంచార్జి కంది శ్రీనివాస్ కి షోకాజ్ పార్టీ కి నష్టం కలిగించేలా వ్యవహరించారని సంజాయిషీ కోరారు. సంజీవ రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి ల మధ్య గొడవ జరగడంతో సంజీవరెడ్డికినోటీసులు ఇచ్చారు. జూపల్లి మల్లారెడ్డి నర్సా రెడ్డి పై అనుచిత వ్యాక్యాలు చేశారని ఫిర్యాదు రావడంతో మల్లారెడికి నోటీసులు ఇచ్చామని తెలిపారు వంశీ కారుపై దాడి చేశారు అని వచ్చిన ఫిర్యాదు లో నోటీసులు ఇచ్చామని వివిధ చోట్ల జరిగిన క్రమశిక్షణరాహిత్య సంఘటనలు మల్లు రవి వివరించారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేయడం నా డిక్షనరీ లో లేదనీ మల్లు రవి అన్నారు. నేను పొరపాటు చేస్తే ఎఐసిసి కి ఫిర్యాదు చేయవచ్చు అని ఆయన సవాల్ చేశారు. నాకు టికెట్ రాకపోయినా,పొత్తులో బిఆర్‌ఎస్ కోసం అప్పుడు పని చేశా అని గుర్తుచేసుకొన్నారు. రాజగోపాల్ రెడ్డి నకిరేకల్ సభకు రావడం మంచి పరిణామం అని అన్నారు



అహింసా స్తూపం ఆవిష్కరణలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

# టెక్నాలజీతోపాటు భారతీయ సంస్కృతిని జెన్‌జి యువత కాపాడాలి

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

## దేశంలోనే తొలిసారిగా 'అహింసా స్తూపం' మియాపూర్‌లో ఆవిష్కరణ

**హైదరాబాద్ (గచ్చిబౌలి), సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** భారతదేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన 'అహింసా స్తూపాన్ని' ఆదివారం ప్రారంభించారు. మియాపూర్ వైశాలినగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అహింసా స్తూపాన్ని ఆదివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా నగరంలో అహింసా స్తూపం నగరంలో ఆవిష్కరించడం మనందరికి ఎంతో గర్వకారణమని, ఈ స్థూపం రాబోయే తరాలకు శాంతి, అహింసల దివ్య సందేశాన్ని అందిస్తుందన్నారు. అహింసా స్థూపం ఏర్పాటులో జైన్ సమాజ మహిళలు ముందుకు వచ్చి నాయకత్వం వహించడం విశేషమని, ఈ కార్యక్రమంతో ప్రపంచానికి ఐక్యత, మానవీయ సందేశాన్ని చాటిచెప్పారని అభినందించారు. అహింసా స్థూపం మీద లిఖించిన 'పరస్పరోనుగ్రహో జీవానాం' నినాదం నేటి అశాంతి యుత ప్రపంచంలో ఎంతో అవసరమని అన్నారు. అహింస అంటే కేవలం శారీరక హాని చేయకపోవడమే కాదని, మాటల్లో, ప్రవర్తనలో, ఆలోచనల్లో శాంతిని పాటించకపోవడమేనని అన్నారు. అహింస మన బలహీనత కాదని, అత్యున్నత బలమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందని, పార్లమెంటరీ స్థాయిలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీ శక్తి వందన్ ఆదినీయం ఇందుకు నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో విభిన్న సమాజాల పాత్ర ఉందని, జైన్ బ్రాహ్మణ, మహేశ్వరీ వంటి వివిధ సమాజాలు మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. 2047నాటికి వికసిత్ భారత్ సాధనలో భాగంగా ఆర్థిక, సాంకేతిక వృద్ధితోపాటు మన సాంస్కృతిక మూలాలు, విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. నేటి జెన్‌జీ యువత అందుబాటులో ఉన్న టెక్నాలజీతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సంస్కృతి, సంస్కారాలను ఎప్పటికీ విడిచిపెట్టవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులతో పాటు మంచి విలువలు, సంస్కారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసే స్వార్థ శక్తులను ప్రజలందరూ కలిసికట్టుగా ఓడించాలని, ప్రజలందరూ ఐకమత్యంతో నిలబడడమే వికసిత్ భారత్‌కు బలమైన ప్రేరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, తెలంగాణ పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, శేరిలింగం పల్లి బిజెపి ఇంచార్జ్ ఎం.రవికుమార్ యాదవ్, జైన్ సమాజ ప్రతినిధులు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఆటోల ర్యాలీలో పాల్గొన్న మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

# ప్యారడైజ్ జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-1 ఎలివేటెడ్ కారిడార్లు

## పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 6:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం ప్యారడైజ్ జంక్షన్ వద్ద ప్రతి పాదిత ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్, కనెక్టివిటీ, భూసేకరణ, మౌలికవసతుల అవసరాలను పరిశీలించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్-44పై, అలాగే ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు ఎన్‌హెచ్-1 (రాజీవ్ రహదారి)పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన ప్రణాళి కలను అధికారులు సీఎస్‌కు వివరించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్యారడైజ్, సికింద్రాబాద్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల మధ్య రవాణా కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఉత్తర హైదరాబాద్ ప్రాంతం నుంచి ఓఆర్‌ఆర్‌కు వేగవంతమైన అనుసంధానం ఏర్పడటంతో పాటు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ కారిడార్లు దోహదపడ నున్నాయి. ప్రత్యేకించి సికిందరాబాద్- బొల్లారం-శామీర్‌పేట్ మార్గంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కారిడార్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని సీఎస్ అధికారులకు వివరించారు.

### ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు ప్రాధాన్యం

ప్యారడైజ్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని తగ్గిం చడం, వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడం ఎలివేటెడ్ కారిడార్ల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు అమలులో భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, వివిధ శాఖల మధ్య సమన్వయం, అవసరమైన అనుమతులు తదితర అంశాలను వేగంగా పరిష్కరించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ ట్రాఫిక్ అవస రాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్లతో పాటు మెట్రో రైలు, ప్రధాన రహ దారులు, ఓఆర్‌ఆర్ మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ఈ పరిశీలనలో హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో రైలు, హెచ్ఎం డీఏ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయ్

## ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏది?

## మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసన

## కార్యక్రమంలో మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, వెయ్యి రోజుల పాలనలో ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పై నిరసన కార్యక్రమంలో భాగంగా బిఆర్‌టియు ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఆటోల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఆటో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, పిల్లల ఫీజు, ఈఎంఐ కట్టలేని పరిస్థితిలో ఆటో కార్మికుల కుటుంబాలు ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి ఏర్పాటు చేయలేదని, ఎన్నికల హామీలలో కాంగ్రెస్ రూ.12,000 వేల ఆర్థిక సహాయం ఏమైందని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు పెరగడంతో ఆటో కార్మికుల కుటుంబాలు తినడానికి ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, కెసిఆర్ కిట్, తులం బంగారం, పెంచుతామన్న పెన్షన్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పిఆర్‌సి, ఎరియర్స్, మెడికల్ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయానికి కరెంటు లేక పంటలు ఎండుతున్నాయి. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు చనిపోతే రైతు భీమా కూడా ఇవ్వడం లేదని ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికుల కుటుంబాలకు ఒక భరోసా ఉండేదని, రైతులు,నేత,గీత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి రాష్ట్రములో ఉందన్నారు. వెయ్యి పడకల ఆస్పత్రి భవనము పూర్తి చేసి అందులో వసతులు కల్పించి ప్రారం భించడం లేదు. టూరిజం హోటల్ నిర్మాణం పనులు కూడా నిలిపివేశారని ఆరోపించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు ఎవరు భయపడవద్దు,వచ్చేది బీ ఆర్ ఎస్ ప్రభుత్వం, మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసాని ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు నవకాంత్, కుర్వ శ్రీశైలం, నరేష్, నరేందర్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీను నాయక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రవల్లి మండలంలో ఘోర ప్రమాదం

# లారీని ఢీకొన్న కారు

## ఇద్దరు దుర్మరణం

**ఎర్రవల్లి, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి బలంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గద్వాల వైపు వెళ్తున్న టిఎస్ 10 ఎఫ్‌ఎఫ్ 4641 నంబర్ గల కారు పదవ బెటాలియన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే అదుపుతప్పింది. రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని తీవ్ర వేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జవగా, అందులో ప్రయాణిస్తున్న మోనిక, సాయికుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో కారును ముఖేష్ అనే వ్యక్తి నడుపుతున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమా లేక మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పబ్‌లో అర్ధరాత్రి బాహాబాహీ

## జూబ్లీహిల్స్‌లోని పబ్‌లో ఇరువర్గాల హంగామా

## ఒక వర్గంలో ఎంపి సోదరుడు

## సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని ఒక స్టార్ హోటల్ పబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇరువర్గాల మధ్య బాహాబాహి చోటుచేసుకొంది. ఒకవర్గంలో ఓ ఎంపి సోదరుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ దసపల్ల హోటల్‌లోని ఎనిమిదో అంతస్థులో కారా కారా పేరుతో పబ్ కొనసాగుతున్నది. కాగా శనివారం రాత్రి దాదాపు 2.10 గంటల ప్రాంతంలో పబ్లో దాదాపు 200ల మందికిపైగా ఉన్నారు. అదే సమయంలో పబ్ లో గోడకు, బల్లకు మధ్యన రాజ్యసభ సభ్యుడి సోదరుడు అరవింద్ యాదవ్ (టిల్లు)ను దాటుకొని వెళ్లడానికి ఒక యువకుడు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మొదట మాటమాట పెరిగి గొడవకు దారి తీసి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడే ఉన్న అరవింద్‌యాదవ్ స్నేహితులు ఆ యువకుడిపై దాడికి దిగగా, యువకుడికి చెందిన స్నేహితులు సైతం ఒక్కసారిగా రెచ్చిపోయి అరవింద్ తోపాటు అతని స్నేహితులపై ఎదురుదాడికి దిగారు. దీంతో పబ్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతవారణం చోటుచేసుకొంది. ఇరువర్గాలు దాదాపు పది నిమిషాల పాటు ఇక్కడ ఒకరినొకరు కొట్టుకున్నారు. మద్యం సీసాలు ఎత్తి దాడికి యత్నించారు. ఈ గొడవలో ఒక యవతి కింద పడిపోయింది. అదే సమయంలో పబ్లోని బౌన్సర్లు వచ్చి ఇరువర్గాలను అడ్డుకొని అక్కడ నుంచి కిందకు పంపారు. ఇరువర్గాలకు చెందిన అనుచరులు దసపల్లా హోటల్ సెల్లార్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఒకరిపై ఒకరు దాడికి తెగబడ్డారు. ఇరువర్గాలు దాదాపు అరగంటకు పైగా దాడులు చేసుకున్నారు. కొన్ని కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల్లో కొందరికి గాయాలయ్యాయి. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన 20 నుంచి 30 మంది వరకు ఉన్నట్లు తెలుస్తుంది. హోటల్ నిర్వాహకులతోపాటు అక్కడే ఉన్న కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సంఘటనాస్తలానికి చేరుకున్నారు.

హోటల్లో బల్లలు, కుర్చీలు దెబ్బతిని ఉండటాన్ని గుర్తించారు. దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను సైతం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సీసీ టీవీ ఫుటేజీల్లో ఒక రాజ్యసభ సభ్యుడి సోదరుడు అరవింద్ యాదవ్ టోపి ధరించి ఉన్నట్లు గుర్తించారు. దసపల్లా హోటల్ ఫోర్ స్టార్ హోటల్ కావడంతో 24 గంటలపాటు మద్యం సరఫరా చేయడానికి దసపల్లా రెస్ట్ అండ్ బార్ ఏ యూనిట్ ఆఫ్ జూబ్లీ రిస్టార్ట్స్ పేరుతో 2 బి బార్ లైసెన్స్ ఉంది. అయితే వినోదాత్మక లైసెన్స్ ను నగర పోలీసులు ఇవ్వాల్సి ఉండగా ఆయా లైసెన్స్ లేనట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంతోపాటు సమయానికి మించి ఆలస్యంగా పబ్ కొనసాగినట్లు గుర్తించి ఎస్సై సందీప్రెడ్డి ఫిర్యాదు మేరకు సుమోటోగా రెండు వేర్వేరు కేసులను నమోదు చేశారు. అరవింద్ యాదవ్ తోపాటు మరో 20 మంది ఈ గొడవలో పాల్గొన్నట్లు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించామన్నారు. నిందితుల్లో పాత బస్తీకి చెందిన వారితోపాటు ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన వారు కొందరు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించా మన్నారు.

# ఢిల్లీలో కుప్పకూలిన హాస్టల్ భవనం

## శిథిలాల కింద పలువురు పేయింగ్‌గెస్ట్ విద్యార్థులు

## ఇద్దరు మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** దేశ రాజధాని ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఇవాళ మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్కే పురం నియోజకవర్గ పరిధిలోని స్థానిక శివ మందిరం సమీపంలో ఉన్న ఒక బహుళ అంతస్తుల పాత భవనం అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఈ భారీ ప్రమాద సమయంలో భవనంలో ఉన్న పేయింగ్ గెస్ట్ వసతి గృహానికి చెందిన పలువురు విద్యార్థులతో పాటు, అక్కడ పనులు చేస్తున్న కొంతమంది నిర్మాణ కార్మికులు కూడా శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది.ప్రాథమిక సమాచారం ప్రకారం ఇద్దరు మృతిచెందగా మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఉన్నట్లు తేలింది. శిథిలాలకిందచిక్కుకున్న విద్యార్థులు తమ సెల్‌ఫోన్లద్వారా బయటివ్యక్తులకు కాల్‌చేసి తమను కాపాడాలని వేడుకుంటున్న నినాదాలు ప్రత్యక్ష సాక్షులకు వినిపించాయి. వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర విభాగాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్, ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ), ఢిల్లీ పోలీస్, ఎంసీడీ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పక్కనే ఉన్న మరో నివాస భవనాన్ని కూడా అధికారులు ఖాళీ చేయించారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ శర్మ మీడియాతో మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి ఢిల్లీకి ఉన్నత చదువుల కోసం వచ్చి ఇక్కడ పీజీ వసతి గృహాలలో నివసిస్తున్న విద్యార్థులు ఈ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. శిథిలాల లోపలి నుంచి కొందరు విద్యార్థులు ఫోన్ కాల్స్ చేస్తూ తమను కాపాడాల్సిందిగా వేడుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ఈ ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందించారు. బాధితులను సురక్షితంగా రక్షించడం, వారికి తక్షణ సహాయం అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని తెలిపారు. ఈ పాత భవనంలో నిబంధనలకు విరుద్ధంగా బేస్ మెంట్ నిర్మాణం , ఆధునీకరణ పనులు చేపడుతుండటమే ఈ ఘోర ప్రమాదానికి దారితీసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటన జరిగిన ప్రదేశం ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు దగ్గర్లోనే ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పలువురు విద్యార్థులు కూడా సహాయక చర్యల్లో సాయం అందిస్తున్నారు. అయితే కనీసం 30 నుంచి 40 మందివరకూ శిథిలాల కింద చిక్కుకున్నారని, వీరిలో ఐదుగురిని రక్షించి ఎయిమ్స్‌కు తరలించినట్లు ఢిల్లీ పర్యావరణ మంత్రి మన్‌జీందర్ సింగ్ సిర్సా వెల్లడించారు. జెసిబిలను కూడా ప్రమాదస్థలానికి తరలించి శిథిలాలను వేరు చేస్తున్నారు. 17 అంబులెన్స్‌లను కూడా భవనం స్థలానికి తీసుకువచ్చారు.

కాంగ్రెస్, సిజెపిలకు చెందిన వలంటీర్లు ప్రమాదస్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో సాయం అందించాలని పిలుపునిచ్చాయి. సరైన వసతి సౌకర్యాలు లేవనడానికి ఈ సంఘటన ఉదాహరణ అని రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఢిల్లీ ఆప్ అధినేత అరవింద్‌కేజ్రీవాల్ ఇదొక హృదయ విదారక సంఘటన అని బాధితులను సత్వరమే రక్షించాలని కోరారు. ఢిల్లీలో ప్రభుత్వ నిర్లక్ష్యం ఎక్కువయిందని, ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు.అయితే బిజెపి నాయకులు మాత్రం విపక్షాల వ్యాఖ్యలను కొట్టివేస్తూ సంఘటన ప్రాంతంలో ఇప్పటికే సహాయక చర్యలు అందుతున్నాయని వైద్య సౌకర్యాలు తక్షణమే అందుతున్నాయని పేర్కొన్నారు. బిజెపి ఎమ్మెల్యే కైలాశ్ గెహ్లోత్ విపక్షాల వ్యాఖ్యలను కొట్టిపారేసారు. సకాలంలో సత్వరమే స్పందించిన ఢిల్లీ ప్రభుత్వం విపత్తునిర్వహణ సంస్థ, అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు సంఘటన ప్రాంతంలో సహాయక చర్యల్లో పాల్గొన్నాయని విపక్షాలకు ఇవి కనిపించవా అని ప్రశ్నించారు.

## స్పెషల్ డ్రైవ్ చేపడతాం : డిజిపి సివి ఆనంద్

# ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై నెటిజన్ల ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివా హాలతోపాటు శుభకార్యాల వద్ద ట్రాన్స్‌జెండర్లు హంగామా చేస్తూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తుండడంపై కఠినంగా వ్యవహరించేందుకు చర్యలు తీసుకుంటామని డిజిపి సి.వి.ఆనంద్ హామీ ఇచ్చారు. ట్రాన్స్ జెండర్ల ఆగడాలను నివారించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలని పోలీసులను ఆదేశించనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని చింతల్‌లో ఒకచోట గృహప్రవేశం వేడుకల్లో ట్రాన్స్‌జెండర్లు హంగామా సృష్టించి రూ. 50 వేలు డిమాండ్ చేయడంపై స్థానికులు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డిజిపి ఆనంద్ ఈ మేరకు వెల్లడించారు. ఈ నెల 4న చింతల్‌లో జరిగిన ఘటనపై ఇంటి యజమాని, వారి కుటుంబ సభ్యులు ట్రాన్స్‌జెండర్ల నుంచి తాము ఎలాంటి ఇబ్బందులు పడ్డామనే దానిపై విడియో ద్వారా సోషల్ మీడియాలో వెల్లడించడం సంచల నం రేపింది. రూ. 50 వేలు ఇవ్వాల్సిందేనని ట్రాన్స్ జెండర్లు డిమాండ్ చేయగా, తాము అంత ఇచ్చుకోలేమని ఇంటి యజమాని చెప్పారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహం చెందిన ట్రాన్స్‌జెండర్లు బట్టలు విప్పివేసి అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు కుటుంబ సభ్యులను శాపనార్థలు పెట్టారని బాధితులు ఆ విడియోలో తెలిపారు. ఈ విడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో నెటిజన్లు దీనిపై నేరుగా డిజిపి ఆనంద్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ఇటువంటి వాటిని వెంటనే అరికట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఆనంద్.. ఇటువంటి ఫిర్యాదులు ఇటీవల కాలంలో తన దృష్టికి వచ్చాయని, తాను హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా వున్న సమయంలో ట్రాన్స్ జెండర్ల ఆగడాలపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించానని తెలిపారు. ఇప్పుడు మరోసారి ట్రాన్స్‌జెండర్ల ఆగడాలు పెరిగినందున కఠినంగా వ్యవహరిస్తామని ఆయన తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను డిజిపి ప్రస్తావించారు. చాలామంది ట్రాన్స్‌జెండర్లు గౌరవంగా జీవిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

# నిర్మాతల మండలి ఎన్నికల్లో సి.కళ్యాణ్ ప్యానెల్ విజయం




ప్యానెల్ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న సి. కళ్యాణ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 6, ప్రభాత వార్త:** ఫిల్మ్‌నగర్లోని ఫిలింఛాంబర్‌లో ఆదివారం జరిగిన తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఎన్నికల్లో నిర్మాత సి.కళ్యాణ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ప్యానెల్ మొత్తం ఈ ఎన్నికల్లో విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 1,168 మంది సభ్యులకు గాను 643 మంది సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల్లో తమ ప్యానల్‌కు మద్దతు ఇచ్చిన నిర్మాత లందరికీ సి.కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి సైతం నిర్మాతలు హైదరాబాద్‌కు వచ్చి ఓటు వేయడం, తమ ప్యానల్‌కు దాదాపు 95 శాతం మంది మద్దతు ఇవ్వడం తమపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో భాగంగా ఉపాధ్యక్షుడిగా మోహన్ వడ్లపట్ల 338 ఓట్లతో విజయం సాధించగా, కె.ఎల్. దామోదర్ ప్రసాద్ (దాము)కు 274 ఓట్లు వచ్చాయి. గౌరవ కోశాధికారిగా చదలవాడ శ్రీనివాసరావు 383 ఓట్లతో ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా అమ్మి రాజు కానుమిల్లి 416, టి. రామ సత్యనారాయణ 398 ఓట్లు సాధించారు. వీరితోపాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పద్మిని నాగులపల్లి (426), రవిశంకర్ యలమంచిలి (మైత్రి రవి) (412), సునీల్ నారంగ్ (411), జె.వి. మోహన్ గౌడ్ (404), కృష్ణప్రసాద్ శివలెంక (397), డి.వి.వి. దానయ్య (360), ఎన్. వంశీకృష్ణారెడ్డి (వంశీ నందిపాటి) (355), పల్లి కేశవరావు (345), దమ్మాలపాటి శ్రీనివాస రావు (డి.ఎస్. రావు) (337), శ్రీనివాసరావు వజ్జ (329), జె. పుల్లారావు (325), బాపిరాజు బల్లిపాడు (324), పి. రామకృష్ణాగౌడ్ (304), నయీమ్ అహ్మద్ ఎస్.కె. (285), కె. నిరంజన్ రెడ్డి (281) ఎన్ని కయ్యారు. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ మాట్లా డుతూ.. గత రెండున్నరేళ్లుగా నిర్మాతలందరూ కలిసి ముందుకు సాగలేక పోయారని, ఇకపై అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ముఖ్యంగా చిన్న నిర్మాతలు సొంత డబ్బులతో సినిమాలు నిర్మించి, వాటిని విడుదల చేసేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్న నిర్మాతల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి త్వరలో మీడియా ద్వారా ప్రకటిస్తామని తెలిపారు. ప్రతి సభ్యుడు తన సభ్యత్వాన్ని పూర్తి చేసుకోవాలని సూచించిన సి.కళ్యాణ్.. తనను అధ్యక్షుడిగా గెలిపించడంలో కీలకంగా సహకరించిన బండ్ల గణేష్‌కు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. నిర్మాతలందరినీ కలుపుకుని ముందుకు వెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# బాల్ బ్యాట్‌మెంటన్ విజేతలకు అవార్డుల ప్రదానం



**అల్లూరు (నెల్లూరు), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** అల్లూరులోని రామక్రిష్ణ జూనియర్, డిగ్రీ కళాశాలలో 12వ సీనియర్ అంతర్‌జిల్లాల బాల్‌బ్యాట్‌మెంటన్ పోటీలు గత మూడు రోజులుగా నిర్వహించారు. ఈ పోటీలకు ఆదివారం ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి మాత్రమే కాకుండా జీవితంలో క్రమశిక్షణ, పట్టుదలను నేర్పుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే మనందరి లక్ష్యం అన్నారు. ఈ పోటీలు ఎపి బాల్‌బ్యాట్‌మెంటన్ అసోసియేషన్(సాప్), ఎస్‌పిఎస్‌ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతేకాకుండా క్రీడాస్ఫూర్తిని విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. ప్రతి క్రీడాకారుడు మైదానంలో చూపించే పట్టుదలే మిమ్మలను భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు తీసుకెలుతుందని తెలిపారు. క్రీడాకారులు టీమ్‌వర్క్ సమిష్టి కృషి ఎంతో అవసరం అన్నారు. రాష్ట్ర క్రీడాకారులు కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలల్లో పాల్గొని దేశానికి, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. క్రీడాకారుల ఎదుగుదలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం పురుషుల విభాగం ప్రకాశం జిల్లా టీమ్ రన్నర్స్, వైజాగ్ టీమ్ మహిళల విభాగం విన్నర్స్‌గా, గుంటూరు జిల్లా టీమ్‌లకు ఎమ్మెల్యేచే మెమోంటోలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలి

**బుచ్చి (నెల్లూరు), సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బుచ్చిరెడ్డిపాళెంలో పార్టీ కార్యాలయంలో నాయకులతో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు స్థానిక ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహం వార్డుల వారీగా పార్టీని బలోపేతం చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో అనూహ్య అభివృద్ధిని సాధించామని ఆమె తెలిపారు. వవ్వేరు గ్రామానికి చెందిన అల్లం శ్రీనయ్యతోపాటు ఆయన అనుచరులు 10 మంది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.


తెలంగాణ ప్రభుత్వం

**నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**

పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, నీటి పారుదల సర్కిల్, ఖమ్మం

క్ర.సం.1, టెండర్ నోటీసు సంఖ్య: 19/2026-27, తేది: 19.08.2026-2వ పిలుపు, పని పేరు: భక్త రామదాసు ఎత్తిపోతల నీటి పారుదల పథకానికి చెందిన 10.5 మెగావాట్ల సింక్రోనస్ మోటార్-1, పంప్ హౌస్ మరియు ప్రెజర్ మెయిన్‌కు ప్రధాన మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనులు, ఎర్రగడ్డ తండా (గ్రామం), కుసుమంచి (మండలం), ఖమ్మం జిల్లా. కాంట్రాక్ట్ అంచనా విలువ: రూ.82,07,000.00. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 07.09.2026 మ.3.00 గం. బిడ్ సమర్పణ ముగింపు తేది: 16.09.2026 సా.4.00 గం. గమనిక: మరిన్ని వివరాల కోసం దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ను సందర్శించండి. https://tender.telangana.gov.in

సం/- (ఎం. వెంకటేశ్వర్లు), సూపరింటెండింగ్ ఇంజనీర్, నీటి పారుదల సర్కిల్, ఖమ్మం

DIPR.No.9267-PP/CL/Advt/1/2026-27, తేది: 05.09.2026


వార్త

మనుషుల వెనుక చెప్పే మాటలను వారి ముఖాల మీదనే చెబితే సమాజం నిలబడటం కష్టం.

- బాల్జాక్


# 'సర్' సాగుతోంది!

ప్రజాస్వామ్యంలో పోలింగ్ బూత్ వరకు వెళ్లిన ఒక నిజమైన ఓటరు తన ఓటు జాబితాలో లేదని వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చినా అది ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. ఇది విజ్ఞులంతా చెప్పేమాట. కాని ఓటరు జాబితాల ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రక్రియ ఎన్నో చిక్కుముడులతో భారతీయ ఓటరును క్రాస్‌రోడ్స్‌లో నిలబెట్టింది. ఇంతదాక ఎన్నోసార్లు ఎప్పటికప్పుడు ఆ ముడులను విప్పదీయాలని కొత్త కొత్త మార్గాలలో ప్రయత్నించినా అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. అసలీ ప్రక్రియే ఎవరికీ అంతుబట్టని రహస్యంగా తిప్పలు పెడుతోంది. చట్టపరంగా అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామిక ప్రక్రియలో కీలకం. కాగా ఓటరు తన ధృవపత్రాలలో శీలపరీక్ష చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఓటరు ఎంత విసి గెత్తిపోతాడో ఎన్నికల కమిషన్ అర్థం చేసుకున్నట్లుగా లేదు. 'సర్' ప్రక్రియ చట్టబద్ధతకు లోబడే ఉందని దేశ అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది. కనుక దాని మీద ఎవరికీ ఏ సందేహమూ అవసరం లేదు. జరిగే ప్రక్రియలో ఓటరు సమస్య తీరే దారే దొరకడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలుంటే అందులో ఉన్న పాత ఓటర్ల జాబితాలో 32 శాతం మంది ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. చాలా తిరస్కరణలకు సంబంధించి సరైన కారణాలు చెప్పకుండా తుది ఓటర్ల జాబితాలో అనర్హత కలిగిన ఓటర్లుగా నమోదు చేశారు. వారు తమ ధృవీకరణ పత్రాలను చూపితే, ఎన్నికల అధికారి ఆమోదిస్తే వారికి ఓటు హక్కు నిలబడుతుంది. లేకుంటే వారికి ఈసారి ఎన్నికలలో ఓటు వేసే భాగ్యం కలుగదు. స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్‌లో దాదాపు 60 లక్షల మంది ఓటర్లు తాము ఓటరుగా అర్హులేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అవకతవకల జాబితాలో ఉన్నవారి సందిగ్ధానికి సంబంధించి బూత్‌స్థాయి ఏజెంట్లకు కూడా అందించలేకపోవడం విచిత్రం. నిజానికి వ్యత్యాసాల గురించి ఆయా ఓటర్ల పేర్లను వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచురించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినా ఆ మేరకు జాబితాల ప్రచురణలో తెలంగాణ ఎన్నికల అధికారులు వెనుకబడే ఉన్నారు. అలాంటి జాబితాల ప్రచురణ వలన ప్రజల్లో అనవసరం ఆందోళనలు, భయాలు తొలగిపోతాయి. దేశవ్యాప్తంగా చూస్తే మూడో దశ వరకు 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలో 6 కోట్ల మందిని తొలగించినట్లు సిఇసి స్పష్టమైన ప్రకటనే చేసింది. ఎన్నోసార్లు ప్రక్రియలో లోపాలను సరిదిద్దుతూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా చివరాఖరికి తేలిందేమిటంటే ఏలిన వారి కనుసన్నల్లో జరిగిందంటూ అపప్రథను నెత్తిన మోస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం పుణ్యమా అని 13 కోట్లకు పైగా ఓట్లు గల్లంతయ్యాయి. ఎన్నికల కమిషన్ సూచిస్తున్న పత్రాలు అంత తేలికగా దొరకుతాయన్న నమ్మకం లేదు. ఒకటికి పదిసార్లు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగిన ఆ పత్రాలు కానరాక పోవచ్చు ఇప్పటికే తమ పేర్లలో అక్షరం పొట్లు తేడా ఉన్నా ఓటు హక్కు పోగొట్టుకున్న ఓటర్లు లబోదిబోమంటున్నారు. వారి ఓటు హక్కు ఖరారు చేయించుకోవాలంటే తలప్రాణం తోకలోకి వస్తోందంటే నమ్మండి. అన్ని వివరాలు సరిగా ఉండి పుట్టిన తేదీ అంకెల్లో ఒక అంకె తేడా పడినా అదేదో పారలాక్స్ ఎర్రర్ అనో అచ్చుతప్పో అని సరిపెట్టుకునే పరిస్థితి లేదు. తాము శాశ్వత నివాసమున్న చోటు నుంచి మరో ప్రాంతానికి తాత్కాలికంగా వలస వెళ్లిన ఓటర్ల పరిస్థితి మరీ విడ్డూరంగా ఉంది. వారున్న చోటు కానీ, శాశ్వత నివాస ప్రాంతంలో కానీ ఓటు హక్కు దక్కదు. ఈ ప్రక్రియ రాజకీయంగా పరిపాలనా పరంగా ఎన్నో విమర్శలు ఎదుర్కొంటోంది. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఈ ప్రక్రియలోనిలోపాలను ఎత్తి చూపుతుంటే కేంద్ర ఎన్నికల సంఘం మాత్రం అన్నీ సజావుగానే జరుగుతున్నట్లు ఓటరును భ్రమలో ఉంచే ప్రయత్నం చేస్తోంది. 'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని' అన్నట్లు భార్య ఓటు ఉండి భర్త ఓటు నమోదుకాని సందర్భాల్లో వాటిని కూడా వ్యత్యాసాలుగానే నోటీసు లందించారు. ప్రతి ఎన్నికకూ ముందు ఓటర్ల సవరణ ప్రక్రియ సాగుతూ మార్పులు, చేర్పులు జరిగినా కూడా ఎన్నికల సంఘం దృష్టిలో 2002 తర్వాత జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన ఇదేనన్నట్లుగా భావిస్తోంది. ఈ ప్రక్రియలో బిఎల్‌ఒలు ఒత్తిడి కారణంగా మృతి చెందిన ఉదంతాలు నమోదయ్యాయి. వెరిఫికేషన్ ప్రక్రియలో కూడా ఓటర్లు అంతే స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. తన పేరు తేడా ఉన్నందున తనకు నోటీసులు అందాయని సాక్షాత్తు తెలంగాణ ఎన్నికల కమిషనర్ సుదర్శన రెడ్డి చెప్పడాన్ని చూస్తే అంతటి వారికే జాబితాలో అవకతవకలు ఉండటమేమిటని ఓటర్లు ఎద్దేవా చేస్తున్నారు. 'సర్' ప్రక్రియ ఎంత సజావుగా, నిజాయితీగా జరుగుతోందని చెప్పుకునేందుకు ఆయన విషయాలను బహిర్గతపరిచినా ఓటర్లకు ఎన్నికల కమిషన్ మీద ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. సిఇఒకే నోటీసు అందిందంటే చర్చనీయాంశమే. వివరణ కోరే ఏనోటీసు అయినాస్వాగతించదగినదే కానీ ఆ పత్రానికి ఏం జవాబివ్వాలో, ఎలా జవాబివ్వాలో తెలియని పరిస్థితిలో ఓటరు గందరగోళానికి గురవ్వడమే ఇక్కడ విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 1.37 కోట్ల మందికి 'సర్' నోటీసులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో 44.25 లక్షల మందికి కాగా తెలంగాణలో 92.87 లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తాజాగా మూడు వారాలు గడువు పొడిగించినా మిస్సయిన ఓటర్లంతా ప్రధాన జీవన స్రవంతిలో ఎప్పటికి చేరగలరో ఆ లోగుట్టు పరమాత్మునికే ఎరుక.



వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.

గౌతమ బుద్ధుడు



మార్పు అంటే ప్రపంచానికి గిట్టదు. కాని మార్పు వల్లనే అభివృద్ధికి అవకాశం కలుగుతుంది.

శామ్యూల్ బట్లర్

# ఎన్నికల్లో నల్ల డబ్బే కీలకమా?

**ఎన్నికల్లో డబ్బు పాత్ర పెరిగే కొద్దీ ప్రజాసేవ చేయాలనుకునే సామాన్య వ్యక్తి రాజకీయాల్లోకి రావడం కష్టమైపోతోంది. ఎందుకంటే అతని దగ్గర కోట్ల రూపాయలు ఉండకపోవచ్చు. పెద్ద రాజకీయ పరిచయాలు లేకపోవచ్చు. వందల మందిని ఎన్నికల కోసం సమీకరించే ఆర్థిక శక్తి ఉండకపోవచ్చు. కానీ అతనికి నిజాయితీ ఉండవచ్చు. ప్రజల కోసం పనిచేసే సంకల్పం ఉండ వచ్చు. అలాంటి వ్యక్తి డబ్బు రాజకీయాల ముందు ఓడిపోతే ప్రజాస్వామ్యం గెలిచినట్టా? లేక ధనస్వామ్యం గెలిచినట్టా? ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా వచ్చిన డబ్బు నిజంగా ఎన్నికలను ప్రభావితం చేస్తుందనే ఆధారాలు ఎక్కడైనా లభిస్తే, వ్యక్తి ఎంత పెద్దవాడైనా, పార్టీ ఎంత శక్తివంతమైనదైనా, నిధుల మూలాన్ని దర్యాప్తు చేయాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా మొత్తం ప్రాంతాన్ని లేదా ఒక రాజకీయ పార్టీని ఎర్రచందనం మాఫియాగా ముద్ర వేయడం బాధ్యతారాహిత్యమే అవుతుంది.**

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

స్థానిక రాజకీయాలు మారితేనే దేశ రాజకీయాలు మారతాయి, దేశ రాజకీయాలపై మనం ఎన్నో విమర్శలు చేస్తాం, పార్లమెంటులో అవినీతి అంటాం, రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తాం, పార్టీలను తప్పుబడతాం. కానీ ప్రజాస్వామ్యానికి మొదటి పాఠశాల అయిన స్థానిక రాజకీయాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తాం. నిజానికి దేశ రాజకీయాల నాణ్యతను మార్చాలంటే మార్పు గ్రామం నుంచే ప్రారంభం కావాలి. ముఖ్యంగా ఇప్పుడు మన రాష్ట్రంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఒక వృక్ష జాతి ఉందంటే నమ్మగలమా? నిజమే మన రాష్ట్రంలోనే కాదు, ప్రపంచంలోనే అరుదైన వృక్షంగా ఖ్యాతి గడించిన ఎర్రచందనం చెట్లు. రాయలసీమ అంటే కేవలం కరవు, వెనుకబాటుతనం, వలసలు మాత్రమే కాదు. ఈ ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎర్రచందనం కూడా ఉంది. అయితే అదే ఎర్రచందనం అక్రమ రవాణా, స్మగ్లింగ్, రాజకీయ అధికార సంబంధాలు, నల్ల ధనం వంటి ఆరోపణలతో తరచూ వార్తల్లోకి వస్తోంది. స్థానిక ఎన్నికల సమయంలో ఈ నల్లధనం రాజకీయాల్లోకి ప్రవహిస్తుందనే ఆరోపణలు వినిపించినప్పుడల్లా మనలో వచ్చే అసలు ప్రశ్న, ఎర్రచందనం విలువ ఎంత?ఆ సంపద ఎవరి చేతుల్లోకి వెళ్తోంది?ఆ డబ్బు ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందా? అనే దానిపై చూస్తే భయమేస్తోంది. ఎర్రచందనం చెట్టు అడవిలో సహజసిద్ధంగా పెరుగుతుంది. దాన్ని అక్రమంగా నరికే వ్యక్తులు కొందరు, రవాణా చేసే వ్యక్తులు మరొకరు, అంతర్జాతీయ మార్కెట్‌కు చేసే గొలుసు కట్టు మరొకటి. మధ్యలో స్థానికంగా రక్షణ, సమాచారం, లాజిస్టిక్స్, రాజకీయ ప్రభావం వంటి అంశాలు ఉంటే అది కేవలం స్మగ్లింగ్ కాదు, ఒక వ్యవస్థీకృత నల్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. అలాంటి డబ్బు ఎన్నికలలోకి వస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. అడవిని దోచిన డబ్బుతో ఓటును కొనడం జరిగితే, అది కేవలం అవినీతి కాదు ప్రజాస్వామ్యంపై ద్వంద్వ దోపిడీ. మొదట అడవిని దోచుకుంటారు, తర్వాత ఆ డబ్బుతో ఓటును ప్రభావితం చేస్తారు. చివరికి అధికారాన్ని ఉపయోగించి అదే వ్యవస్థను కాపాడుకునే ప్రయత్నం జరుగుతుంది. పంచాయతీ, మండల పరిషత్, మున్సిపల్ వంటి స్థానిక సంస్థలు ప్రజల రోజువారీ జీవితానికి అత్యంత దగ్గరగా ఉంటాయి. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాలు, గ్రామీణ వనరులు ఇవన్నీ స్థానిక సంస్థల నిర్ణయాలతో సంబంధం కలిగి ఉంటాయి. అందువల్ల స్థానిక ఎన్నికల్లో డబ్బు ప్రభావం అంటే కేవలం ఒక అభ్యర్థి గెలుపుకాదు. రేపటి గ్రామపాలన ఎవరి చేతుల్లో ఉండాలి అన్న ప్రశ్న. ప్రజల సమస్యలను పరిష్కరించే వ్యక్తి గెలవాలా? లేకడబ్బు ఖర్చు చేయగల వ్యక్తి గెలవాలా? ఎర్రచందనం డబ్బుఉంటే ఎన్నికల ఖర్చును ఎందుకు ప్రశ్నించకూడదు?ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థి తన సాధారణ ఆర్థిక సామర్థ్యానికి మించి భారీగా ఖర్చు చేస్తున్నాడనే అనుమానం వస్తేదాని



మూలాన్ని పరిశీలించడం అధికార యంత్రాంగం బాధ్యత. అదే సమయంలో ఎర్రచందనం అక్రమ రవాణా, నల్లధనం, ఎన్నికల ఖర్చుల మధ్య సంబంధం ఉందనే నిర్దిష్ట సమాచారం ఉంటే దానిపై సమగ్ర దర్యాప్తు జరగాలి. ఇక్కడే ఎన్నికల వ్యవస్థకు ఒక పెద్ద సవాలు ఉంది. డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరికి చేరింది? ఎవరెవరు ఎంతఖర్చు చేశారు? ఎవరెవరు లబ్ధి పొందారు? ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానాలు దొరికితేనే నిజమైన ఎన్నికల పారదర్శకత సాధ్యమవుతుంది. రాయలసీమలో ఎర్రచందనం అడవులు కేవలం ప్రభుత్వ ఆస్తి కావు, అవి జీవవైవిధ్యానికి నిలయం, భవిష్యత్ తరాలకు చెందిన సహజవనరు పర్యావరణ సంపదలు. చెట్లను అక్రమంగా నరికితే నష్టపోయేది కేవలం అటవీ శాఖ మాత్రమే కాదు. నష్టపోయేది ప్రజల ఆస్తి. నష్టపోయేది పర్యావరణం. నష్టపోయేది ముఖ్యంగాభవిష్యత్ తరాలు. ఆచెట్లను నరికిన డబ్బు ఎన్నికలలోకి వచ్చి ప్రజల ఓట్లను ప్రభావితం చేస్తే, నష్టం మరింత పెరుగుతుంది. అందుకే ఎర్రచందనం అక్రమ రవాణాను కేవలం అటవీ నేరంగా చూడకూడదు. ఇది పర్యావరణ నేరంగాను, ఆర్థిక నేరంగాను అవసరమైతే ఎన్నికల నేరంగాను చూడాలి. ఓటుకు డబ్బు తీసుకున్న వ్యక్తిని మాత్రమే నిందించడం సులభం. కానీ ప్రశ్నించాల్సింది ఓటు కొనడానికి అంత డబ్బుఎక్కడి నుంచి వచ్చింది? ఎన్నికల సంఘం, పోలీస్, అటవీ శాఖలు సవాలుగా తీసుకుని రాబోవు స్థానిక ఎన్నికలలో మూడు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. ప్రముఖంగా ఎన్నికల యంత్రాంగం అక్రమ ఎన్నికల ఖర్చు, ఓటర్ల ప్రలోభాలను పర్యవేక్షించాలి. పోలీసు శాఖ నేర పూరిత నిధుల ప్రవాహాన్ని, అక్రమ రవాణా నెట్వర్క్‌లపై దర్యాప్తు చేయాలి. అటవీ శాఖ ఎర్రచందనం అక్రమ నరికివేత, రవాణా, నిల్వ, స్మగ్లింగ్‌ను అడ్డుకోవాలి. అవసరమైతే ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థలు కూడా నిధుల మార్గాన్ని పరిశీలించాలి. ప్రజలు కూడా ప్రశ్నించాలి. ఎన్నికలలోడబ్బు తీసుకోవడం సాధారణమై పోతే ప్రజాస్వామ్యం నెమ్మదిగా మార్కెట్‌గా మారుతుంది. ఈ రోజు రెండు వేలరూపాయలకు ఓటు అమ్ముకున్న వ్యక్తి రేపు తన గ్రామంలో మంచి రోడ్డు అడిగే నైతిక హక్కును కోల్పోతారు. కానీ అతని ఓటును కొనుక్కున్న రాజకీయ వ్యవస్థ మాత్రం ప్రజాసేవను వ్యాపారంగా మార్చే ప్రమాదం ఉంది. ఎన్నికల్లో డబ్బు పాత్ర పెరిగే కొద్దీ ప్రజాసేవ చేయాలనుకునే సామాన్య వ్యక్తి రాజకీయాల్లోకి రావడం కష్టమైపోతోంది. ఎందుకంటే అతని దగ్గర కోట్ల రూపాయలు ఉండకపోవచ్చు. పెద్ద రాజకీయ పరిచయాలు లేకపోవచ్చు. వందల మందిని ఎన్నికల కోసం సమీకరించే ఆర్థిక శక్తి ఉండకపోవచ్చు. కానీ అతనికి నిజాయితీ ఉండవచ్చు. ప్రజల కోసం పనిచేసే సంకల్పం ఉండవచ్చు. అలాంటి వ్యక్తి డబ్బు రాజకీయాల ముందుఓడిపోతే ప్రజాస్వామ్యం గెలిచినట్టా? లేక ధనస్వామ్యంగెలిచినట్టా? ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా వచ్చిన డబ్బు నిజంగా ఎన్నికలను ప్రభావితం చేస్తుందనే ఆధారాలు ఎక్కడైనా లభిస్తే,వ్యక్తి ఎంత పెద్దవాడైనా, పార్టీ ఎంత శక్తివంతమైనదైనా, నిధుల మూలాన్ని దర్యాప్తు చేయాలి. అదే సమయంలో ఆధారాలులేకుండా మొత్తం ప్రాంతాన్ని లేదా ఒక రాజకీయ పార్టీని ఎర్రచందనం మాఫియాగా ముద్ర వేయడం బాధ్యతారాహిత్యమేఅవుతుంది. అడవిని కాపాడాలి, నల్ల ధనాన్ని అడ్డుకోవాలి, స్థానిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఎందుకంటే అడవిలోఎర్రచందనం దోపిడీ అయితే అది ప్రకృతి దోపిడీ, ఆ దోపిడీ డబ్బుతో ఓటు కొనబడితే అది ప్రజాస్వామ్య దోపిడీ.రాయలసీమకు కావలసింది మాఫియా డబ్బుతో నడిచే రాజకీయాలు కాదు ప్రజల విశ్వాసంతో నడిచే స్థానిక పాలన.అందుకే స్థానిక ఎన్నికల అసలు ప్రశ్న ఎవరు గెలుస్తారు?కాదు. ఎవరు గెలిస్తే ప్రజలు గెలుస్తారు? అదే నిజమైనప్రజాస్వామ్య పరీక్ష. స్థానిక రాజకీయాలు మారితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజాస్వామ్యం బలపడితేనే దేశం బలపడుతూ అభివృద్ధి చెందుతుంది. ●

# సింగిల్ విండోలపై రాజకీయ పట్టు మంచిదేనా?



శ్రీశైలం దూడం

రైతు రుణం, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లతో ముడిపడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రజల నోట సింగిల్ విండోలుగా పేరుపొందాయి. రైతుల భాగస్వామ్యంతో నడిచే ఈ సంస్థలకు నాయకత్వాన్ని రైతులే ఎన్నుకోవాలా? లేక ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ, పరిపాలనా నియామకాలతో పాలకవర్గాలను ఏర్పాటు చేయాలా? తెలంగాణలో ఇప్పుడు ఇదే అసలు ప్రశ్న. జీవో ఆర్‌టి నంబర్ 597కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకోవడం, గతఎన్నికైన పాలక వర్గాల కొనసాగింపుపై హైకోర్టు ముందు చోటుచేసుకున్న పరిణామాలు ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. తాత్కాలిక ఏర్పాట్లు శాశ్వత పరిష్కారం కావు. సహకార రంగానికి దీర్ఘకాలిక మార్గం చట్టబద్ధమైన ఎన్నికలే. తెలంగాణలో మొత్తం 60,925 సహకార సంఘాలు ఉన్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో రైతులకు ప్రత్యక్ష సంబంధం ఉన్న పీఏసీఎస్‌లు 906. తొమ్మిది జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పరిధిలోని ఈ సంఘాల్లో 906 ఛైర్మన్ పదవులు, సుమారు పది వేల డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. అంటే గ్రామీణ స్థాయిలో వేలాది నాయకత్వ అవకాశాలు, రైతుల ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడిన కీలక వ్యవస్థ. జీవో 597 చుట్టూ సాగిన పరిణామాలు ఈ పదవుల భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరతీశాయి. రైతు సంస్థల నాయకత్వం ఎన్నికల ద్వారా రావాలా, నియామకాల ద్వారా రావాలా అన్న ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

తాత్కాలిక పాలన ప్రజాస్వామ్యానికి శాశ్వత ప్రత్యామ్నాయం కాదు. సింగిల్ విండోలు సాధారణ ప్రభుత్వ కార్యాలయాలు కావు. సభ్యుల భాగస్వామ్యం, ఆర్థిక కార్యకలాపాలు, రుణాలు, గ్రామీణ వ్యవసాయ అవసరాలతో ముడిపడిన సహకార సంస్థలు. ప్రభుత్వం వాటిని పర్యవేక్షించవచ్చు. అవకతవకలు జరిగితే విచారణ చేయవచ్చు.నిధుల దుర్వినియోగం నిర్ధారణైతే బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు. ఓటర్ల జాబితాల్లో లోపాలుంటే సరిచేయవచ్చు. కానీ కొందరి తప్పుల పేరుతో చట్టబద్ధంగా ఓటు హక్కు




ఉన్న రైతు సభ్యుల ఎన్నికల అవకాశాన్ని నిరవధికంగా పక్కనపెట్టడం సరైన పరిష్కారం కాదు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోండి.. కానీ రైతు ఓటుపై తాళం వేయకండి. జగిత్యాల జిల్లా పోతారం సింగిల్ విండో సొసైటీ రైతుల ఐక్యతతో రెండు కోట్ల రూపాయల ఆదాయాన్ని సొంతంగా సమకూర్చుకుందని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికైన పాలకవర్గం ఉంటే ప్రశ్నించే గొంతుకు అవకాశం ఉంటుంది. నామినేటెడ్ వ్యవస్థలో భిన్నాభిప్రాయాలకు స్థానంతగ్గిపోతుందన్న ఆందోళన ఉంది. సంఘాల ఆర్థిక వనరుల వినియోగంపై పారదర్శకత, సభ్యులకు జవాబుదారీతనం ఉండాలంటే ప్రజాస్వామ్యబద్ధమైన పాలకవర్గాలే బలమైన మార్గం. ఇది ఒక్కపోతారంసమస్య కాదు, రాష్ట్రవ్యాప్తంగా సహకార రంగం భవిష్యత్తుకు సంబంధించిన అంశం. రైతు డబ్బు, రైతు భాగస్వామ్యంఉన్న చోట రైతు స్వరం కూడా ఉండాలన్నదే సహకార స్ఫూర్తి. సహకార సంఘం అధ్యక్ష పదవి ఎవరికైనా రాజకీయ బహుమతిగా మారకూడదు. రైతు ప్రయోజనాలకుకట్టుబడి పనిచేసే వ్యక్తి సభ్యుల విశ్వాసాన్ని ఎన్నికల్లో పొందే అవకాశం ఉండాలి. రాజకీయ పార్టీలకు చెందిన రైతులుకూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు,గెలవవచ్చు, ఓడిపోవచ్చు.అదే ప్రజాస్వామ్యం.కానీ ముందుగానే నామినేషన్ల ద్వారాపాలక వర్గాలను ఏర్పాటు చేస్తే ఎంపికకు ప్రమాణం ఏమిటి?రైతు ప్రయోజనమా, రాజకీయ విధేయతా? అన్న సందేహాలు రావడం సహజం. వాటికి తెరపడాలంటే ఎన్నికలే ఉత్తమ మార్గం.ఇక తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. పదవీకాలం ముగిసిన సంఘాల వివరాలను వెల్లడించాలి. చట్టం, సంఘాల ఉపనియమాల ప్రకారం ఓటు హక్కు ఉన్న సభ్యులతో పారదర్శక ఓటర్ల జాబితాలను సిద్ధంచేయాలి. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి వాటిని పరిష్కరించాలి. అనంతరం దశలవారీగా ఎన్నికలషెడ్యూల్ ప్రకటించాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అవసరమైనచోట మాత్రమే పరిమిత కాలపు చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలి. అవి శాశ్వత నామినేటెడ్ పాలనగా మారకూడదు. రైతు సంక్షేమం అంటే కేవలం రుణమాఫీ, సబ్సిడీలు, పథకాలే కాదు. రైతుకు తన సంస్థనిర్వహణలో భాగస్వామ్యంకల్పించడం కూడా సంక్షేమమే. 'మా సంఘానికి నాయకుడిని మేమే ఎన్నుకునే రోజు ఎప్పుడు?' అన్న రైతు ప్రశ్న కేవలం పదవుల వివాదం కాదు.సహకార వ్యవస్థ స్వరూపం, రైతు భాగస్వామ్యం, గ్రామీణ ప్రజాస్వామ్యానికి సంబంధించిన పరీక్ష. ఈ ప్రశ్నకు ప్రభుత్వం మాటలతో కాదు ఎన్నికల నోటిఫికేషన్‌తో సమాధానం చెప్పాలి. నామినేటెడ్ పోస్టులు వద్దు, సింగిల్ విండోలకు ఎన్నికలు కావాలి! రాజకీయ పట్టు కాదు రైతు ఓటే గెలవాలి! ●

# ఉత్పాదక పెట్టుబడులతో ప్రగతికి కొత్త బాట

కొమ్ము అమృత్

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న ఆదాయ వృద్ధి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాలకు సంకేతంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పని చేస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర సొంత ఆదాయ వనరులు బలపడటం కీలక పరిణామం. ఖజానాకు పెరుగుతున్న ఆదాయాన్ని కేవలం సాధారణ వ్యయానికే పరిమితం చేయకుండా మౌలిక వసతులు, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, సాగునీరు, గ్రామీణ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులుగా మళ్లిస్తే తెలంగాణ అభివృద్ధికి మరింత వేగం అందే అవకాశం ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో రాష్ట్రానికి రూ.59,642.62 కోట్ల రెవెన్యూ రాబడి సమకూరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18.64 శాతం అధికం. ఇందులో పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.53,004.40 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే పన్నుల ఆదాయంలో రూ.4,858.83 కోట్ల పెరుగుదల నమోదైంది. పన్నేతర ఆదాయం కూడా రూ.4,274.55 కోట్లకు చేరడం గమనార్హం. ఈ గణాంకాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలకు మరింత విస్తరణకు అవకాశం ఉంది. ఈ ఆదాయ వృద్ధిని స్థిరమైన ఆర్థిక అభివృద్ధిగా మార్చడానికి ప్రభుత్వం ఇప్పుడు ఉత్పాదక పెట్టుబడులపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో రహదారులు, వంతెనలు, సాగునీటి వసతులు, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, తాగునీరు, పట్టణ రవాణా, డ్రైనేజీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెంచితే ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయి. ఒక ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపడితే అక్కడ పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలు వస్తే ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి పెరుగుతుంది. ఉపాధిపెరిగితే కుటుంబాల కొనుగోలు శక్తి పెరుగుతుంది. దాంతో వ్యాపారాలు, సేవారంగం, పన్నుల ఆదాయం కూడా విస్తరిస్తాయి.

అందువల్ల అభివృద్ధి వ్యయాన్ని ఖర్చుగా కాకుండా భవిష్యత్తు ఆదాయాన్ని సృష్టించే పెట్టుబడిగా చూడాల్సిన అవసరం ఉంది. పెట్టుబడులకు తెలంగాణను మరింత ఆకర్షణీయంగా చేయాలి. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోని ప్రముఖ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ కేంద్రాల్లో ఒకటిగా ఉంది. ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన సమయం వచ్చింది. ద్వితీయ, తృతీయ



శ్రేణి నగరాల్లో పారిశ్రామిక మౌలిక వసతులు కల్పించడం, రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడం, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పెట్టుబడులను జిల్లాలకు తీసుకెళ్లవచ్చు. హైదరాబాద్ కేంద్రిత అభివృద్ధి నుంచి తెలంగాణ వ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి వైపు అడుగులు పడాలి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి నగరాలను ప్రాంతీయ ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలి. రాష్ట్ర అభివృద్ధిలో మరో కీలక అంశం ఉపాధి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా విద్యా వ్యవస్థను ఉద్యోగ మార్కెట్‌తో అనుసంధానించాలి. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగం, ఆహార ప్రాసెసింగ్, లాజిస్టిక్స్ వంటి భవిష్యత్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తే పెట్టుబడులతోపాటు ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. రాష్ట్ర అభివృద్ధి అంటే పట్టణాల అభివృద్ధి మాత్రమే కాదు. వ్యవసాయం, అనుబంధ రంగాలు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమవుతుంది. సాగునీరు, గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ సదుపాయాలను విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తే స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. దీర్ఘకాలిక అభివృద్ధికి అత్యంత విలువైన పెట్టుబడి మానవ వనరులపైనే. ప్రభుత్వ విద్యాసంస్థల నాణ్యత పెంపు, ఆధునిక నైపుణ్య శిక్షణ, మెరుగైన వైద్య సదుపాయాలు, మహిళలు-యువతకు ఉపాధి అవకాశాల కల్పన రాష్ట్ర ఉత్పాదకతను పెంచుతాయి. సంక్షేమ పథకాలతో ప్రజలకు భద్రత కల్పిస్తూనే, విద్య-ఉపాధి ద్వారా వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడం మరింత స్థిరమైన అభివృద్ధికి దారి తీస్తుంది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆదాయ వృద్ధి తెలంగాణకు ఒక అవకాశ ద్వారం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే ప్రభుత్వ ముందున్న ప్రధాన కర్తవ్యం. ప్రతి అదనపు రూపాయి ఆదాయం నుంచి గరిష్ఠ ఆర్థిక విలువను సృష్టించేలా పెట్టుబడులు పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి దిశలో మౌలిక వసతులు, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి, వ్యవసాయం, విద్య, వైద్యం, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి సమన్వయం కల్పిస్తే తెలంగాణ ఆర్థిక ప్రగతి మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. ఆదాయం పెరగడం ఆర్థిక శక్తికి సంకేతం. ఆ ఆదాయంతో ఆస్తులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, మౌలిక వసతులు సృష్టించడమే నిజమైన అభివృద్ధి. ఇప్పుడు తెలంగాణ ముందున్న అవకాశం అదే. ●

# ప్రజావాక్కు



## మానవ ధృవీకరణ ముఖ్యం

ఒకప్పుడు ఒక చిత్రం వెయ్యి మాటలతో సమానం. ఇప్పుడు మాత్రం ఒక చిత్రం వెయ్యి అబద్ధాలకు కూడా వేదిక కావచ్చు! కృత్రిమ మేధ సాయంతో క్షణాల్లో అత్యంత సహజంగా కనిపించే ఫొటోలు, దృశ్యాలు సృష్టించగల సాంకేతికత అందుబాటులోకి రావడంతో కంటికి కనిపించేదంతానిజంకాదనే కొత్తవాస్తవాన్ని సమాజం ఎదుర్కొంటోంది. ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, ఘర్షణలు, ఎన్నికలు, ప్రముఖులపై ప్రచారంవంటి సున్నితమైన సందర్భాల్లో నకిలీ చిత్రం ఒక్కటి చాలు ప్రజల్లో భయాన్ని, కోపాన్ని లేదా అపోహలను వ్యాప్తి చేయడానికి. అసలు సంఘటన జరగకపోయినా జరిగినట్లు చూపించడం ఒక ప్రమాదమైతే, నిజమైన సంఘటనకు సంబంధించిన చిత్రాన్ని మార్చి దానిసందర్భాన్ని వక్రీకరించడం మరింత తీవ్రమైన ముప్పు. సామాజిక మాధ్యమాల్లో ఒకసారి వైరల్ అయిన తప్పుడు చిత్రం నిజం కాదని నిరూపించేలోపే వేలాది మందికి చేరుతుంది.అందుకే వేగం కంటే ధృవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఇది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మోసం చేస్తున్న అమెరికా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహాటంగా వెనుజుల ఇంధనం 65 లక్షల బ్యారెళ్ళను తమ ఆధీనంలోకి తీసుకున్న అని ప్రకటించారు. ఇది అంతా మధురోను కస్టడిలోకి తీసుకున్నాక తన మాట వినే నమ్మిన బంటును వెనిజుల అధ్యక్షురాలుగా నియమించిన తరవాత ఇది అంతా చేస్తున్న ట్రంప్ కచ్చితంగా అభద్రతా భావంలో ఉన్నారు. తమ ఆధిపత్యం ఎక్కడ సడపోతోందని భయపడుతున్నారు.భారత్ అమెరికా భయాలకు తలొగ్గక పోగా రష్యా నుండి చమురును కొనడం ట్రంప్‌కి మింగుడు పడదు.

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈ మధ్య సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు ఎంతో సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారు. ఈనేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగి స్తోంది.ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపి ప్రజలను వంచిస్తున్నారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈ మాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోతున్నారు. ఇటువంటి దోపిడీలను అరికట్టడా నికి వ్యవస్థలో మార్పులు రావాలి. .

- కె.నాగరాజు, వరంగల్‌జిల్లా

## పతనమవుతున్న విలువలు

దేశంలో వినోదమే ప్రధానంగా సాగే టీవీఛానళ్ళలో ప్రసారం అయ్యేసీరియళ్ళలో విలువలు పతనమవుతున్నా యి. దేశంలోని అన్ని భాషలలో వచ్చే సీరియళ్ళు దాదా పుగా ఒకే మూస పద్ధతిలో ఉంటున్నాయి.ఈ సీరియళ్ళు ప్రముఖంగా పగ, ప్రతీకారం,ఈర్ష, ద్వేషం, మోసం, దగా, కుయుక్తులు, కుట్రలు, హత్యలు, దొంగవేషాలు, నమ్మించి మోసగించటం వంటి కథాంశాలతో ఊదరగొడతున్నాయి. వృద్ధులు, మహిళలు, పనీపాట లేనివారు ఇత్యాది వర్గాలు వీరి టార్గెట్. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా, ఆ ఛానల్ ఈ ఛానల్ అని లేకుండా అన్నిఛానళ్ళలో వినోదరంగం ప్రజలను టీవీలకు అతుక్కుపోయేంతగా బానిసలను చేస్తోంది.టీవీ సీరియళ్ళలోని వివిధ భావోద్వేగాలు ప్రజలను ప్రభావితం చేస్తూ వారిని దుష్ట మార్గంలోకి లాగుతున్నాయి. ప్రజలు మానసిక రుగ్మతలు కలిగించే టీవీ సీరియళ్ళ జోలికి పోకుండా పుస్తక పఠనమో లేక కొత్త అభిరుచులను పెంచుకుంటూ వాటిలో నిమగ్నమై సమాజానికి తోడ్పాటు కాగలగాలి.

- కె. వెంకట రమణ, సికింద్రాబాద్

## జీతాలలో కోత విధించాలి

ఈ మధ్య కొన్ని ఐటీ దిగ్గజ సంస్థలు సైతం తమకు లాభాలు తగ్గిపోతున్నాయని వేల మంది ఐటీ వుద్యోగుల్ని ఆగమేఘాల మీద తొలగించి వేస్తున్నాయి. వారికి తగిన పరిహారం కూడా చెల్లిస్తున్నామని సంస్థలు ప్రకటిస్తున్నాయిగాని, సంవత్సరాల తరబడి ఆ కంపెనీ వృద్ధికి సేవచేసి జీవితంలో స్థిరపడుతున్న వేళయుజ్ అండ్‌ర్తో అన్నవిధంగా వున్న పళంగా వారి వుద్యోగాలు తొలగించటం అన్యాయం.గొప్పలకోసం పెద్ద వేతనాలు ఇస్తున్నఈసంస్థలు తమనష్టాలను తొలగించుకోవాలనిభావిస్తే వుద్యోగులను తొలగించేబదులు వేతనాలపై కోత విధించాలి.

- టి.సాంబశివరావు, గుంటూరుజిల్లా

## ప్రవర్తన నియమావళి పాటించాలి

ఇటీవల దిగ్భ్రాంతి కలిగిస్తున్న రోడ్ ప్రమాదాల్లో ఆర్‌టిసికి చెందినవి కొంత తక్కువే అని చెప్పొచ్చు. డ్రైవర్ తమ విధులను చక్కగా నిర్వర్తిస్తున్నారు. తమ ఆరోగ్యం, కంటిచూపు తోపాటు ఎంతో ఏకాగ్రత, ముందుచూపుతో ఉంటున్నారు. అదనపు డ్రైవర్ అందుబాటు, సిబ్బందికొరత ఉన్నా,రాబోయే సమయం, పొరపాటు అనూహ్యమైనది. వీటి దృష్ట్యా సిబ్బందికి వైద్యపరీక్షలు కార్పొరేషన్ స్వయంగా చేసేది మంచి విధానం. దానితో పాటు ఇతర నియమాలు, ట్రాఫిక్ అధికారులు ప్రతీనెలతనిఖీ చేస్తే దుస్సంఘటనల నివారణ సాధ్యమే.

-బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మూడేళ్లలో డ్రగ్స్‌రహిత భారత్ లక్ష్యం


## డ్రగ్ నెట్‌వర్క్‌ల నిర్మూలనకు నాలుగు అంచెల వ్యూహం: కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** దేశాన్ని 2029 నాటికి డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. మాదకద్రవ్యాల రహిత యువశక్తి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి దోహదపడాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో పాటు కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్న మాదకద్రవ్యాలపై ఉన్నతస్థాయి సమావేశానికి అమిత్ షా అధ్యక్షత వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి సమస్యలను నిర్మూలించేందుకు ప్రభుత్వం అనుసరించిన విధంగానే మాదకద్రవ్యాల ముప్పును కూడా అంతం చేసేందుకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని షా అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వాటికి నిధులు సమకూర్చడం నుంచి బాధితుల చికిత్స, పునరావాసం వరకు మొత్తం నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేసేందుకు దేశవ్యాప్తంగా సమన్వయంతో కూడిన వ్యూహాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ రహిత యువశక్తి 2047 నాటికి వికసిత్ భారత్‌కు నాయకత్వం వహించాలన్నదే నరేంద్ర మోడీ లక్ష్యం అని షా అన్నారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపై పోరాటం చిన్నచిన్న విభాగాల్లో, విడివిడిగా సాగేదని, చిన్నస్థాయి నిందితులను పట్టుకోవడంతోనే దర్యాప్తు సంస్థలు సంతృప్తి చెందేవని ఆయన అన్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోందని చెప్పారు. నాలుగు అంచెల సమన్వయ వ్యవస్థ 2019లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ కౌంటరింగ్ డ్రగ్ ట్రాఫికింగ్‌ను కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నాలుగు అంచెల వ్యవస్థగా ఏర్పాటు చేసినట్లు షా తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక యాంటీనార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసి, స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న 100 డ్రగ్ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు, విదేశాల్లో దాక్కున్న 100 మంది పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని షా తెలిపారు. కనీసం 75 రహస్య డ్రగ్ ల్యాబొరేటరీలను ధ్వంసం చేయనున్నట్లు చెప్పారు. నక్సలిజాన్ని నిర్మూలించిన తరహాలోనే మాదకద్రవ్యాల ముప్పును కూడా ఎదుర్కొంటామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకూ 36 దేశాల నుంచి 274 మంది వాంటెడ్, పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు తీసుకొచ్చామని షా తెలిపారు. గత మూడేళ్లలో 401 రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, 2026 జూలై వరకు వాటిలో 182 ఉన్నాయని చెప్పారు.

# కొత్త మ్యాప్‌కు కొంతవరకే మద్దతు..

## వాటిని అంగీకరించం : భారత్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపు సరికొత్త 'ఈక్వల్ ఏరియా మ్యాప్'ను (నిజవైశాల్య ప్రపంచ పటం) వినియోగంపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది. అయితే ఈ మద్దతు ప్రపంచ పటంలో ఏ నిర్దష్ట మార్పులకు గానీ.. జాతీయ సరిహద్దుల చిత్రణకు గానీ ఆమోదం తెలిపినట్లు కాదని స్పష్టం చేసింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చేసిన ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఓటు వేసినందుకు గల కారణాలను కూడా వివరించింది. ఈ మద్దతు అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద భూభాగాలు లేదా ప్రదేశాల పేర్లతో సహా రాజకీయ ఉద్దేశాలతో మార్పులు చేసిన పటాల గురించి ప్రస్తావించదు. అంతేకాకుండా ఈ పటంలో జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా సార్వభౌమ భూభాగాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చూపించాలి. అందుకు విరుద్ధంగా తప్పుదారి పట్టించేలా చూపించే ఏ చిత్రీకరణ అయినా ఆమోదయోగ్యం కాదు. సార్వభౌమత్వం, ప్రాదేశి సమగ్రతపై భారతదేశ వైఖరి స్పష్టంగా ఉంటుంది. ఈ విషయంలో రాజీపడే అవకాశమే లేదు' అని జైస్వాల్ స్పష్టం చేశారు.

కొత్త ప్రపంచ పటం..

వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త 'ఈక్వల ఏరియా మ్యాప్'ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. దీంతో 16వ శతాబ్దం నుంచి అమలులో ఉన్న మర్కేట ప్రపంచ పటం కనుమరుగు కానుంది. కొత్త పటంలో భారత్, ఆఫ్రికాలు పెద్దగా కనిపిస్తాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. పటంలో మాత్రమే ఈ మార్పులు కనిపిస్తాయి. దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయానం కోసం రూపొందించిన పాత మర్కేట పటాన్ని ఐరాస కాలం చెల్లినదిగా ప్రకటించింది. దీంతో ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపెట్టింది.

# ఈక్వెడార్ నౌకలను సముద్రంలో ముంచిన అమెరికా సైనిక దళాలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 6:** తూర్పు పసిఫిక్ సముద్ర జలాల్లో అమెరికా సైనిక దళాలు సంచలన ఆపరేషన్ చేపట్టాయి. మాదరద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తున్నాయనే ఆరోపణలపై ఈక్వెడార్‌కు చెందిన పలు వాణిజ్య నౌకలను అడ్డగించి, సముద్రంలోనే ముంచివేశాయి. అయితే నౌకలను ధ్వంసం చేయడానికి ముందే వాటిలోని సిబ్బందిని సురక్షితంగా ఈక్వెడార్ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఇరు దేశాల అధికారులు తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఈ ఆపరేషన్ జరిగినట్లు యుఎస్ సదరన్ కమాండ్ వెల్లడించింది. డ్రగ్స్ స్మగ్లర్లు సముద్రంలో ఏర్పాటు చేసుకున్న 'తేలియాడే ఫ్యూయల్ స్టేషన్లు' లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నది. యుఎస్ఎస్ శాన్ ఆంటోనియో యుద్ధనౌక నుంచి బయలుదేరిన హెలికాప్టర్లు, సిబ్బందిని ఖాళీ చేయించిన తర్వాత నౌకలపై ఆయుధాలు ప్రయోగించి వాటిని ధ్వంసం చేశాయి. ఇందుకు సంబంధించిన విడియోను కూడా అమెరికా సైన్యం విడుదల చేసింది. ఈ ఫ్యూయలింగ్ కేంద్రాలకు ఈక్వెడార్‌కు చెందిన 'లాస్ చోనెరోస్' అనే నేర ముఠాతో సంబంధాలున్నాయని అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సంస్థను అమెరికా ఇప్పటికే విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఇలాంటి తేలియాడే ఫ్యూయల్ స్టేషన్ల ద్వారా చిన్నచిన్న స్పీడ్ బోట్లకు ఇంధనం నింపి, వాటి ద్వారా మాదకద్రవ్యాలను ఉత్తర అమెరికా దేశాలకు తరలిస్తున్నారని ఈక్వెడార్ అంతర్గత వ్యవహారాల మంత్రి జాన్ రీంబెర్గ్ వివరించారు.

# ఇరాన్‌లో ఆయిల్ ట్యాంకర్ పేలుడు..

## 11 మంది మృతి



**టెహ్రాన్, సెప్టెంబరు 6:** ఇరాన్‌లో భారీ పేలుడు సంభవించి 11 మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన పశ్చిమ ఇరాన్, కుర్దిస్థాన్ ప్రావిన్స్‌లోని సనందాజ్ కౌంటీని, హమేదాన్ ప్రావిన్స్‌లోని హమేదాన్ కౌంటీని కలిపే రోడ్డు మార్గంలో జరిగింది. ఈ ఘటన విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ రోడ్డు మార్గంలో ఆయిల్ ట్యాంకర్ వెళుతుండగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఆయిల్ ట్యాంకర్.. దాని ముందున్న వాహనాలను ఢీకొంది. ఈ క్రమంలో ఆయిల్ ట్యాంకర్ పేలి, మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న కార్లతోపాటు, ఇతర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో భారీ పేలుడు జరిగి, ఆ వాహనాల్లోని 11 మంది మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సనందాజ్‌లోని ఆస్పత్రులకు చికిత్స కోసం తరలించారు. ఈ పేలుడు కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కూడా స్తంభించింది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బ్రేకులు ఫెయిల్ అవ్వడం కారణంగానే ఈ పేలుడు జరిగిందని భావిస్తున్నారు. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతోంది. ఆ తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయి. మృతులకు సంబంధించిన వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

# పంజాబ్‌కుమ్ములాటలవల్లే బాఘేల్‌కు స్థానచలనం..

## అసోం కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా బదలీచేసిన ఎఐసిసి



**రాయ్‌పూర్, సెప్టెంబరు 6:** పంజాబ్ కాంగ్రెస్‌లో నెలకొన్న తీవ్ర వర్గ విభేదాల మధ్య పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఏఐసీసీ ఇంఛార్జ్‌గా ఉన్న ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో రాజస్థాన్ కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించింది. 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. బఘేల్‌ను అసోం కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా బదిలీ చేశారు. 2025 ఫిబ్రవరిలో బఘేల్ పంజాబ్ ఇంఛార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ నేతలను ఏకతాటిపైకి తీసుకురావడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం ఆయన ప్రధాన కర్తవ్యం. అయితే, ఆయన హయాంలో అంతర్గత విభేదాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా, పీసీసీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ వర్గం, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జీత్ సింగ్ చన్నీ వర్గాల మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. వారింగ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని చన్నీ వర్గం ఒత్తిడి తెచ్చినా, అధిష్ఠానం ఆయననే కొనసాగించడంతో విభేదాలు వీధికెక్కాయి. పార్టీని బలోపేతం చేసేందుకు బఘేల్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించినప్పుడు ఈ అసమ్మతి బహిర్గతమైంది. పాటియాలాలో జరిగిన ఓ కార్యక్రమంలో బఘేల్, వారింగ్‌ల ముందే కొందరు కార్యకర్తలు చన్నీ లావో, పంజాబ్ బచావో అంటూ నినాదాలు చేశారు. గతనెల 6న లూధియానాలో జరిగిన సమావేశంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. భూపేష్ బఘేల్ గో బ్యాక్ అంటూ కొందరు నిరసనకారులు నినాదాలు చేయడంతో సమావేశం రసాభాసగా మారింది. చన్నీ వర్గీయులు బఘేల్‌కు వ్యతిరేకంగా టీషర్టులు ధరించి, ఘర్షణకు దిగడం పార్టీకి తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించింది. బఘేల్ కేవలం వారింగ్ వర్గానికే మద్దతిస్తున్నారనే భావన చన్నీ వర్గంలో బలంగా నాటుకుపోయింది. ఈ కారణంతోనే బఘేల్ నిష్పక్ష పాతంగా వ్యవహరించ లేకపోయారని, ఆయన్ను తప్పించడం సరైన నిర్ణయమని చన్నీ వర్గీయులు భావిస్తున్నారు. తాజా మార్పులపై వారింగ్ స్పందిస్తూ సచిన్ పైలట్‌కు స్వాగతం పలు కుతూ, బఘేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు అసోం బాధ్యతలు అప్పగించినందుకు అధిష్టానానికి, సహకరించిన పంజాబ్ నేతలకు బఘేల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బద్దలయిన అనాక్‌క్రాకటోవా అగ్నిపర్వతం

## 209 విమానాలు రద్దు.. 23వేలమంది ప్రయాణీకులకు కష్టాలు

**జకార్తా, సెప్టెంబరు 6:** ఇండోనేషియాలోని అనాక్ క్రాకటోవా అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున భారీగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనం కారణంగా వెలువడిన బూడిద పశ్చిమ ఇండోనేషియాలోని పలు ప్రాంతాలకు వ్యాపించింది. దీంతో జకార్తాలోని సుకర్ణో – హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మొత్తం 209 విమానాలు ఈ అగ్నిపర్వతం కారణంగా ప్రభావితంకాగా సుమారు 22,800 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాలు రెండూ ప్రభావితమయ్యాయని అధికారులు చెబుతున్నారు. జావా, సుమత్రా ద్వీపాల మధ్య ఉన్న సుండా జలసంధిలో అనాక్ క్రాకటోవా అగ్నిపర్వతం ఉంది. ఆదివారం ఉదయం 3:53 గంటల సమయంలో సుమారు 30 సెకన్ల పాటు విస్ఫోటనం జరిగిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. అనంతరం రెండు భారీ బూడిద మేఘాలు ఏర్పడ్డాయని, ఒక మేఘం దాదాపు 20 వేల అడుగుల ఎత్తుకు చేరుకుని ఈశాన్య దిశగా కదిలిందని, దీని కారణంగా జకార్తా, బాంటెన్, పశ్చిమ జావా ప్రాంతాలు ప్రభావితమయ్యాయని పేర్కొంటున్నారు. రెండో బూడిద మేఘం ఏకంగా 50 వేల అడుగుల ఎత్తుకు చేరినట్లు సమాచారం. ఇది పశ్చిమ, వాయవ్య దిశగా వ్యాపిస్తూ బాంటెన్, లాంపంగ్, బెంగ్‌కులు, దక్షిణ సుండా జలసంధి, సుమత్రా పశ్చిమాన ఉన్న హిందూ మహాసముద్రంలోని కొన్ని ప్రాంతాలపై ప్రభావం చూపిందని చెబుతున్నారు. బూడిద కారణంగా సుకర్ణోహట్టా విమానాశ్రయంలో మొదట ఉదయం 5:30 గంటల వరకు విమానాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు, తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఆంక్షలను ఉదయం 9:30 గంటల వరకు పొడిగించారు. విమానాశ్రయంలో రాత్రి పార్క్ చేసిన 170 విమానాలు అక్కడే నిలిచిపోయాయి. పలువురు ప్రయాణికులు టికెట్ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరడంతో పాటు చెక్‌ఇన్ చేసిన సామాన్లను కూడా వెనక్కి తీసుకున్నారు. సింగపూర్‌కు వెళ్లే అంతర్జాతీయ విమానాలపై దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. హాంకాంగ్, సిడ్నీ, ఆమ్‌స్టర్‌డామ్, సియోల్, దోహా, కౌలాలంపూర్ విమానాలు రద్దు, ఆలస్యం లేదా రీషెడ్యూల్ అయ్యాయి. లాంపంగ్, బాలి, సురబయ, మకాసర్ ప్రాంతాలకు వెళ్లే కొన్ని దేశీయ విమానాలపైనా కూడా దీని ప్రభావం పడింది. ప్రస్తుతం ఈ అగ్నిపర్వతం బద్ధలవ్వడం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, గాయాలపాలైనట్లు సమాచారం బయటికి రాలేదు.

# గిన్నిస్ రికార్డులకెక్కిన బంగారుకడ్డీ

## 521.2 కిలోల బరువుతో తయారీ




**మెల్‌బోర్న్, సెప్టెంబరు 6:** పశ్చిమ ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత పెర్త్ మింట్ ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు కడ్డీని తయారు చేసి సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పింది. ఏకంగా 521.2 కిలోగ్రాముల (సుమారు 1,149 పౌండ్లు) బరువున్న ఈ భారీ బంగారు కడ్డీని 99.999 శాతం స్వచ్ఛతతో రూపొందించారు. ఈ అరుదైన ఘనతను జూలై 9, 2026న గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారికంగా గుర్తించింది. గతంలో ఈ రికార్డు 2024లో దుబాయ్‌లోని ఎమిరేట్స్ మింటింగ్ ఫ్యాక్టరీ పేరిట ఉండేది. అప్పుడు వారు 300.12 కిలోల బంగారు కడ్డీని తయారు చేశారు. ఇప్పుడు పెర్త్ మింట్ ఆ రికార్డును బద్దలు కొట్టింది. పూర్తిగా ఆస్ట్రేలియా గనుల నుంచి సేకరించిన బంగారంతోనే ఈ కడ్డీని తయారు చేయడం విశేషం. ఇది సుమారు 90 సెంటీమీటర్ల పొడవు, 20 సెంటీమీటర్ల ఎత్తు, వెడల్పుతో ఆకట్టుకుంటోంది. ఈ భారీ కడ్డీ తయారీ ప్రక్రియ అత్యంత క్లిష్టంగా సాగింది. ఇందుకోసం సుమారు 1.5 టన్నుల ముడి బంగారాన్ని శుద్ధి చేసి, చిన్నవి, పెద్దవి అయిన అనేక కడ్డీలుగా మార్చారు. ఆ తర్వాత వాటన్నింటినీ ప్రత్యేకంగా రూపొందించిన అచ్చులో ఉంచి, ఖ్ఫ్లేమ్‌లెస్ కాస్టింగ్ చాంబర్ఖ అనే ప్రత్యేక గదిలో దాదాపు 1,400 డిగ్రీల సెల్సియస్ వద్ద కరిగించారు. అనంతరం అనేక గంటల పాటు నియంత్రిత పద్ధతిలో చల్లబరచగా, ఈ ఏకైక భారీ కడ్డీ రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టులో రిఫైనరీ మరియు ప్రయోగశాలకు చెందిన 35 మందికి పైగా నిపుణులు పాలుపంచుకున్నారు. ఆంగ్లోగోల్డ్ అశాంటి ఆస్ట్రేలియా, బీహెచ్‌పీ, ఎవల్యూషన్ మైనింగ్, గోల్డ్ ఫీల్డ్స్ వంటి ప్రముఖ ఆస్ట్రేలియన్ మైనింగ్ కంపెనీలు ఈ బంగారం సరఫరా చేశాయి. ఈ రికార్డు స్థాయి బంగారు కడ్డీని సెప్టెంబర్ చివరి నుంచి పెర్త్ మింట్‌లో నిర్వహించే గోల్డ్ టూర్‌లో భాగంగా ప్రజల సందర్శన కోసం ఉంచనున్నారు. ఇప్పటికే ఒక టన్ను బరువున్న బంగారు నాణెం, లైవ్ గోల్డ్ పౌర్ వంటి ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఘనతతో బంగారం శుద్ధిలో ఆస్ట్రేలియా సాంకేతిక నైపుణ్యాన్ని, ప్రపంచ విలువైన లోహాల పరిశ్రమలో తమ స్థానాన్ని మరోసారి చాటుకుంది.

# సంక్షిప్త వార్తలు

## ఆప్‌లో చేరిన గ్యాంగ్‌స్టర్ గురుప్రీత్‌సింగ్ సేఖోన్



**ఫిరోజ్‌పూర్, సెప్టెంబరు 6:** పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కీలక పరిణమం చోటుచేసుకుంది. నాభా జైలు నుంచి పారిపోయిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గ్యాంగ్ స్టర్ గురుప్రీత్ సింగ్ సేఖోన్ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో చేరారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని జీరాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సమక్షంలో పార్టీలో చేరారు. సేఖోన్ రాబోయే ఎన్నికల్లో జీరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

## గుండెపోటుతో కన్నుమూసిన జార్ఖండ్ మంత్రి



**రాంచి, సెప్టెంబరు 6:** ఝార్ఖండ్ ప్రభుత్వంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) సీనియర్ నేత సుదివ్య కుమార్ (56) గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి గిరిడీలోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో, కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సోనుగా గుర్తింపు పొందిన సుదివ్య కుమార్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కేబినెట్‌లో పలు కీలక శాఖలను నిర్వహించారు.

## వివాహ వేడుకలో అగ్నిప్రమాదం.. 22 మంది మృతి



**కిన్షాసా, సెప్టెంబరు 6:** డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాజధాని కిన్షాసాలో ఓ వివాహ వేడుకలో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 22 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. కిన్షాసా ఉత్తర ప్రాంతంలోని లింగ్వాలాలో ఉన్న ఒక భవనంలో రాత్రిపూట పొద్దుపోయాక ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము వరకు మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి.

## పట్టాలు తప్పిన మహానంద ఎక్స్‌ప్రెస్

**పాట్నా, సెప్టెంబరు 6:** సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్ల మహానంద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల ఆ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన వల్ల ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే రైల్వే అధికారులు, సాంకేతిక బృందాలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, బోగీలను ట్రాక్‌పైకి ఎక్కించే పునరుద్ధరణ పనులు చేపట్టారు.

## జెఎన్‌యుఇలో ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదులు..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో ఓ ప్రొఫెసర్‌పై తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. కనీసం 10 మంది విద్యార్థినులు సదరు ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న యూనివర్సిటీ అధికారులు కేసును ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కి అప్పగించినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులు సుమారు నెల రోజుల క్రితమే నమోదైనట్లు తెలుస్తోంది. తొలుత ఓ విద్యార్థిని ఫిర్యాదు చేయగా, విషయం ఇతర విద్యార్థులకు తెలియడంతో కొంతమంది సీనియర్ విద్యార్థులు కూడా ముందుకు వచ్చి అదే ప్రొఫెసర్‌పై ఇలాంటి ఆరోపణలు చేసినట్లు సమాచారం.

# పాల్ఘడ్ ప్రైవేట్ ఆసుపత్రిలో డిప్యూటీ సిఎం షిండే అనుచరుల హాల్‌చల్

**ముంబయి, సెప్టెంబరు 6:** ఒక వ్యక్తి చికిత్సకు సంబంధించిన బిల్లుపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో శివసేన నేతలు రెచ్చిపోయారు. ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఈ సంఘటన జరిగింది. జన్మాష్టమి సందర్భంగా దహి హండిలో పాల్గొన్న కృష్ణ భక్త బృందానికి చెందిన ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు అతడ్ని తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో రూ.19,866 బిల్లు ఇవ్వడంతో ఆ వ్యక్తికి చెందిన బృంద సభ్యులు ఆగ్రహానికి గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడ గందరగోళం చెలరేగింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన జిల్లా అధ్యక్షుడు కుందన్ సంఖే, నగర అధ్యక్షుడు రాహుల్ ఘరత్, ఆ పార్టీ కార్యకర్తలు ఐసీయూలోకి ప్రవేశించారు. అక్కడున్న వైద్యులు, నర్సులతో వాగ్వాదానికి దిగారు. వారిని బెదిరించారు. అయితే ఈ గొడవను ఆపడానికి ప్రయత్నించిన ఒక రిసెప్షనిస్ట్ చెంపపై శివసేన నేత కొట్టారు. ఒక మహిళా ఉద్యోగిని ఆయన బెదిరించారు. గాయపడిన వ్యక్తికి అమర్చిన ఐవీ డ్రిప్‌ను తొలగించారు. అతడిని ఆసుపత్రి నుంచి తీసుకువెళ్లినట్లు సిబ్బంది ఆరోపించారు. మరోవైపు శివసేన జిల్లా అధ్యక్షుడు కుందన్, నగర అధ్యక్షుడు రాహుల్, స్థానిక ఎమ్మెల్యే రాజేంద్ర గావిత్ కుమారుడు రోహిత్ గావిత్‌తో సహా 17 మందిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో శివసేన నేతల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.

# దేశం దాటిపోకుండా చైనా కట్టడి!

## టెక్నాలజీ, క్యాపిటల్, మానవ వనరులపై ఫోకస్



**బీజింగ్, సెప్టెంబరు 6:** తమ దేశ మూలాలుగా కనిపెట్టిన కీలక సాంకేతిక పరిజ్ఞానం ప్రజలు, మూలధనం, దేశం దాటిపోకుండా చైనా ప్రభుత్వం తన పట్టును మరింత బిగిస్తోంది. ఈ క్రమంలోనే, దేశ పౌరులు విదేశాలకు వెళ్లడంపై కఠినమైన నిబంధనలను తీసుకువచ్చింది. పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావిస్తే, పౌరులను దేశం విడిచి వెళ్లకుండా నిరోధించేందుకు అధికారులకు అధికారం కల్పించే ఈ కొత్త నిబంధనలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. సున్నితమైన టెక్నాలజీ, డేటా, నైపుణ్యం కలిగిన నిపుణులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించేందుకు చైనా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. చైనాకు చెందిన మనుస్ అనే ఏఐ స్టార్టప్‌ను 2 బిలియన్ డాలర్లతో కొనుగోలు చేసేందుకు మెటా చేసిన ప్రతిపాదనను చైనా అడ్డుకోవడమే ఇందుకు నిదర్శనం. జాతీయ భద్రత కారణాలను చూపుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ ఒప్పందాన్ని డ్రాగన్ సర్కార్ రద్దు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, టెక్నాలజీ దిగుమతి లేదా ఎగుమతి నిబంధనలను ఉల్లంఘించి దేశ పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ప్రమాదం కలిగించే వారిని దేశం విడిచి వెళ్లకుండా నిరోధించవచ్చు. విదేశాల్లో చైనా జాతీయ భద్రతకు, ప్రయోజనాలకు హాని కలిగించే నేరాలకు పాల్పడిన వారు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు విదేశాలకు వెళ్లకుండా నిషేధం ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ ఆంక్షలు కేవలం ప్రజలకే పరిమితం కాలేదు. దేశం నుంచి మూలధనం, వ్యూహాత్మక ఆస్తులు తరలిపోకుండా నిరోధించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి ఏడాదికి 50వేల డాలర్ల కంటే ఎక్కువ విదేశీ మారకాన్ని కొనుగోలు చేయరాదనే నిబంధన ఇప్పటికే ఉంది. గతేడాది చైనా వాణిజ్య మిగులు రికార్డు స్థాయిలో 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో, చైనా కంపెనీలు, వ్యక్తులు భారీగా విదేశీ ఆస్తులు, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతున్నారు.

ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం నిఘాను మరింత కఠినతరం చేసింది. చైనా స్టేట్ కౌన్సిల్ జూన్‌లో విడుదల చేసిన నిబంధనల ప్రకారం,

పెట్టుబడిదారులు నియంత్రిత టెక్నాలజీ, డేటా, ఇతర నియంత్రిత వస్తువులు లేదా సేవలను విదేశీ పెట్టుబడుల ద్వారా ఎగుమతి చేయడాన్ని నిషేధించారు.

# ఇజ్రాయెల్‌పై మెరుపుదాడులకు రూటు మార్చిన ఇరాన్

## హమాస్, హెజ్బొల్లా, హౌతీలతో ఏకకాలంలో ముప్పేట దాడులు

**టెహ్రాన్; సెప్టెంబరు 6:** అమెరికా సాయంతో ఇరాన్ పై ఇజ్రాయెల్ మొదలుపెట్టిన దాడులు ఆరు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి ఎలా ముగింపు పలకాలో తెలియక అమెరికా సతమతం అవుతూనే ఉంది. మధ్యలో చర్చలు, శాంతి ఒప్పందం పేరుతో కొంతకాలం హంగామా చేసినా, ఇజ్రాయెల్ ఒత్తిడితో అమెరికా ఈ యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తోంది. రెండు నెలల్లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఎదుర్కోబోతున్న ట్రంప్ సర్కార్ కు ఇరాన్ యుద్ధం తలనొప్పిగా తయారైంది. దీంతో కొంతకాలం యుద్ధాన్ని ఆపి, ఇరాన్ ను ఆర్థిక దిగ్బంధం చేసే దిశగా ట్రంప్ ఎత్తులు వేస్తున్నారు. దీంతో ఇదే అదనుగా ఇరాన్ రూటు మారుస్తోంది. ఇన్నాళ్లూ అమెరికా అండతో తమపై రెచ్చిపోయిన ఇజ్రాయెల్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ భారీ వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ఒకేసారి తమకు అండగా ఉంటున్న మిలిటెంట్ గ్రూపులు హమాస్, హిజ్బొల్లా, హౌతీలతో కలుపుకుని ఇజ్రాయెల్ పై మెరుపుదాడి చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన మెరుపు దాడి తరహాలోనే, ఈసారి అంతకంటే ప్రమాదకరమైన ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయాలని ఇరాన్ యోచిస్తోంది. ఇజ్రాయెల్ ను అన్ని వైపుల నుంచి ఏకకాలంలో ముట్టడించి, ఆత్మరక్షణలో పడేయడమే ఈ సరికొత్త ఆపరేషన్ యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. హిజ్బుల్లా, హమాస్, హౌతీలతో ఇజ్రాయెల్ సైనిక అంచనాల ప్రకారం, ఈ ఉమ్మడి సైనిక చర్యలో లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా, గాజాలోని హమాస్, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల, ఇరాక్‌లోని బలమైన ఇరాన్ అనుకూల మిలిషియాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత అక్టోబర్ 7 దాడి ప్రధానంగా హమాస్ నేతృత్వంలో మాత్రమే సాగింది. అయితే, ఈసారి అన్ని భాగస్వామ్య శక్తులు ఒకే బలమైన వ్యూహంలో భాగంగా ప్రారంభం.

# పెట్టుబడుల ఉపసంహారణ, పబ్లిక్ ఇష్యూపై నిర్ణయం తీసుకోలేదు

## పరిశీలనలో ఆర్థిక సలహాదారుని నియామకం

## రాష్ట్ర ప్రభుత్వానిదే విధాన నిర్ణయం

## వార్త కథనంపై టిజి విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వివరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ (టిజి ట్రాన్స్కో)లో పెట్టుబడుల ఉపసంహారణకు గానీ లేదా పబ్లిక్ ఇష్యూ తీసుకురావడానికి గానీ తెలంగాణ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (టీపీసీసీ) ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ట్రాన్స్కో స్పష్టం చేసింది. ఈ నెల 5వ తేదీన వార్త దినపత్రికలో "విద్యుత్ ప్రసార సంస్థ వాటాల విక్రయం" అనే శీర్షికతో వచ్చిన వార్తకు ఆదివారం ట్రాన్స్కో వివరణ ఇచ్చింది. వాటాల విక్రయం, పబ్లిక్ ఇష్యూ వెళ్లాలని నివేదిక సూచిస్తున్నట్లు పేర్కొనడం సరికాదని తేల్చిచెప్పింది. అలాగే ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ లిమిటెడ్ (పిడబ్ల్యూసి)ని గానీ లేదా మరే ఇతర సంస్థను గానీ నియమించడానికి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. ప్రస్తుతం, రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిని అధ్యయనం చేసి, వాటిని బలోపేతం చేసే మార్గాలను సూచించడానికి ఒక ఆర్థిక సలహాదారుని నియమించాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందని వెల్లడించింది. ఈ అధ్యయనం యొక్క ఉద్దేశ్యం చాలా స్పష్టమైనదని తెలిపింది. విద్యుత్ సంస్థల ఖాతాలో వివిధ సమయాల్లో, వివిధ వడ్డీ రేట్లకు తీసుకున్న రుణాలు ఉన్నాయని, వీటిలో కొన్ని అధిక వడ్డీ రుణాలు కూడా ఉన్నాయని వివరించింది. అటువంటి రుణాలను తక్కువ వడ్డీ రుణాలతో భర్తీ చేయగలిగితే, లేదా మెరుగైన నిబంధనలతో పునర్వ్యవస్థీకరించగలిగితే, ఆ సంస్థలపై వడ్డీ భారం తగ్గుతుందని భావిస్తున్నట్లు తెలిపింది. ప్రతిపాదిత ఈ అధ్యయనం, ఆ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలు, తిరిగి చెల్లించాల్సిన బాధ్యతలు, నిర్వహణ మూలధన అవసరాలు, క్రెడిట్ రేటింగ్‌లు మరియు వాటి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచగల ఇతర రంగాలను కూడా పరిశీలిస్తుందని వెల్లడించింది. కాగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కామ్‌లు తమ ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడం, తమ రుణాన్ని మరింత మెరుగ్గా నిర్వహిం చుకోవడం, ఆర్థికంగా బలోపేతం కావడం అనే అంశాలను తెలుసుకోవడానికి ఇది ఒక ప్రయత్నం మాత్రమేనని తెలంగాణ ట్రాన్స్కో స్పష్టం చేసింది. విద్యుత్ సంస్థలో పెట్టుబడుల ఉపసంహారణ లేదా ప్రభుత్వ వాటాల మార్పుకు సంబంధించిన ఏ నిర్ణయమైనా, యజమానిగా రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయమని పేర్కొంది.

# మెట్రో రైల్‌లో ప్రయాణించిన సిఎస్ సంజయ్‌జాజు

## సేవలు, స్టేషన్లలో సౌకర్యాల నిర్వహణపై తనిఖీ

## మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ ప్రవేశపెట్టాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు6:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం హైదరాబాద్ మెట్రో రైల్‌లో ప్రయాణిస్తూ మెట్రో రైల్ సేవలు, స్టేషన్లలోని ప్రయాణికుల సౌకర్యాలు, నిర్వహణ, ఇతర కార్య కలాపాలను పరిశీలించారు. బేగంపేట్ మెట్రో స్టేషన్ నుంచి ప్యారడైజ్ మెట్రో స్టేషన్ వరకు ఆయన మెట్రో రైల్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ ఎండీ అజిత్ రెడ్డి సీఎస్ వెంట ఉన్నారు.



ప్రయాణ సమయంలో మెట్రో రైల్ కార్యకలాపాలు, ప్రయాణికుల రద్దీ, స్టేషన్లలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రైళ్ల నిర్వహణ, ప్రయాణి కులకు అందుతున్న సేవలను సీఎస్ పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా మెట్రో రైల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించడం, ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. నగర ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన మరియు పర్యావరణహిత ప్రజా రవాణా అందించడంలో హైదరాబాద్ మెట్రో రైల్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని సీఎస్ అధికారులకు సూచించారు. మెట్రో రైల్ సేవలను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు సాధారణ ప్రయాణికుడిగా ప్రయాణించడం ద్వారా ప్రయాణికుల అనుభవాన్ని తెలుసుకోవడం, వారి అవసరాలు మరియు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశంగా ఉంది.

# మంత్రి శ్రీధర్‌బాబుతో నీతిఆయోగ్ సభ్యుడు భేటీ

## తెలంగాణ సిలికాన్ ఫొటోనిక్స్ మిషన్‌కు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపకల్పనపై చర్చ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు 6:** నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ ఆదివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సిలికాన్ ఫోటోనిక్స్ రంగంలో ఉన్న అవకాశాలను తెలంగాణ అందిపుచ్చుకునేలా 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంపై ప్రధానంగా చర్చించారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణ, ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0తో 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'ను అనుసంధానించేందుకు గల అవకాశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయడం, డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను అనుసంధానించడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మలిచేలా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కోప్యాకేజ్డ్ ఆప్టిక్స్ లాంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అందుకు అనుగుణంగా నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర కార్యచరణ ప్రణాళికను రూపొందించడంపై ఇప్పటి నుంచే దృష్టి సారించామన్నారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా.వీకే సారస్వత్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కూడా కోరారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా.వీకే సారస్వత్ పేర్కొన్నారు.

ఈ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తనవంతు సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈసీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దుర్భాషలాడుతున్నారని ప్రతిపక్ష నేత సాకులు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త:** ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రమ్మని మేం అడిగితే ముఖ్యమంత్రి బూతులు తిడుతున్నాడని చిన్నపిల్లాడిలా ప్రతిపక్షనేత సాకులు చూపుతూ గైర్హాజరుకు మార్గం వేసుకొన్నాడని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఆదివారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ అ సెంబ్లీకి రావడం చేతకాని కెసిఆర్ ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తాడట అని విర్శించారు. కెసిఆర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను బకరాలను చేస్తున్నాడనీ ఎమ్మెల్యేలకు గాలి కొట్టి పార్టీలోనే ఉంచుకోవడానికి కెసిఆర్ తాపత్రయపడుతున్నాడనీ అన్నారు.1000 రోజుల్లో పట్టుమని పది సార్లు ఫామ్‌హౌస్ దాటి రాని కెసిఆర్ కూడా పోరాటాల గురించి మాట్లాడు తున్నాడని ఎగతాళి చేశారు. ప్రజల కోసం , ప్రజల పక్షాన అసెంబ్లీకి రావడానికి కెసిఆర్ కాలు కదలడం లేదు..ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికే కెసిఆర్ మాట్లాడుతున్నాడనీ అన్నారు మా సిఎం రేవంత్ రెడ్డి ఏనాడైనా అసెంబ్లీలో అసభ్య పదజాలం వాడారా?ప్రతి మాట రికార్డుల్లో ఉంటుంది. కెసిఆర్ దమ్ముంటే ఆ మాటలు ఏమిటో చూపించాలనీ మా సిఎం మాట్లాడిన ఏ మాట ఇప్పటి వరకు రికార్డుల్లో నుంచి తొలగించలేద అని ఆయన అన్నారు. బూతుల గురించి, ఎదుటివారిని కించపరిచే మాటల గురించి కెసిఆర్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందనీ అన్నారు.బూతులను పరిచయం చేసిందే కెసిఆర్ ఆయన బూతులతో ఒక సినిమా తయారు చేయొచ్చు అని అన్నారు. కావాలంటే ఒక క్యాసెట్ చేసి పంపిస్తామనీ తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడటం చేతకాని కెసిఆర్ అసెంబ్లీకి రానని నిర్లజ్జగా చెబుతున్నారని అన్నారు. కెసిఆర్ బుర్జవా మనసత్వాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలనీ అధికారంలో ఉంటే తప్ప అసెంబ్లీకి రామని చెపుతున్న కెసిఆర్ ఆలోచన ను చూడాలనీ ఆయన కోరారు.. కెసిఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఎలాంటి భంగం కల్గించమని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు చెప్పారని అన్నారు.

# ప్రజారోగ్యంతోనే వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యం

## కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

## ఆరోగ్యం, పోషకాహారం, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన మహా ఉద్యమంగా మారాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,సెప్టెంబరు6:** ఆరోగ్యవంతమైన ప్రజలు లేకుండా ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం సాధ్యం కాదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలంటే ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఫిట్‌నెస్, క్రీడలు, మహిళలు, పిల్లల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఏ.వి. కళాశాల ప్రాంగణంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ఐదు రోజుల పాటు నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్విజ్, పోస్టర్ మేకింగ్, వీడియో మేకింగ్, పోషకాహార వంటకాల తయారీ వంటి పోటీల ద్వారా ముఖ్యంగా విద్యార్థులు, యువత, మహిళల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా పరిమితం కాకుండా ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై స్వయంగా బాధ్యత తీసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నిద్ర, వ్యాయామం, నడక, యోగా, క్రీడలను రోజువారీ జీవన విధానంలో భాగం చేసుకోవాలని సూచించారు.అవసరానికి మించిన నూనె, చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు, యువతలో అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు.ఇంటివద్ద తయారు చేసే తాజా, పోషక విలువలున్న ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, జంక్ ఫుడ్‌పై అధికంగా ఆధారపడే అలవాటును తగ్గించాలని సూచించారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, శారీరక శ్రమను తగ్గించిందని కేంద్ర మంత్రి అన్నారు.ఈ సందర్భంగా పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, ఐదు రోజుల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించామని తెలిపారు. వివిధ పోటీలు, కార్యక్రమాల ద్వారా సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను తెలియజేశామని అన్నారు. అవగాహన కార్యక్రమం ముగింపు కాదు చర్యకు నాంది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సామ జగన్మోహన్ రెడ్డి, ఏ.వి. ఎడ్యుకేషన్ బోర్డు సభ్యులు కె. వినోద్ రెడ్డి, ఏ.వి. కాలేజ్ కరస్పాండెంట్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, సిబ్బంది, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ప్రజల పక్షాన శ్రీపాద వాణి

## అరుదైన శాసనసభా ప్రసంగాల సంకలనం!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు6:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలో శాసన సభా నిర్వహణలో తనదైన చెరగని ముద్ర వేసిన నాయకుడు, మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు శాసనసభా ప్రసంగాలు త్వరలోనే అక్షర రూపంలో మన ముందుకు రాబోతున్నాయి. సభా రికార్డుల్లో మైలురాయిగా నిలిచిపోయే ఈ ప్రతిష్టాత్మక గ్రంథం అత్యున్నత ప్రమాణాలతో రాబోతుందని ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కార్యాలయంలో ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి' పేరిట రూపొందిన ఈ అరుదైన ప్రసంగాల సంకలనాన్ని ఈ వర్షాకాలం శాసనసభ సమా వేశాల ఆవిష్కరించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు తెలిపారు.

నవంబర్ 6, 1937లో దుద్దిళ్ల రాధాకృష్ణయ్య, కమలాభాయి దంపతులకు జన్మించిన శ్రీపాదరావు, బి.ఎస్సీ, ఎల్.ఎల్.బి పట్టా అందుకున్నారు. తన స్వగ్రామం ధన్వాడకు వరుసగా మూడుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై... గ్రామ స్థాయి నుంచి తన ప్రజాసేవను ప్రారంభించారు. తర్వాత మంథని భూతనఖా బ్యాంక్ చైర్మన్‌గా, మహాదేవ్‌పూర్ సమితి ఉపాధ్యక్షుడిగా పనిచేసి, 1983లో తొలిసారిగా మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం 1984, 1989లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ విప్‌గా, రీజనల్ టొబాకో బోర్డు సభ్యుడిగా, పలు అసెంబ్లీ కమిటీల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 1991 ఆగష్టు 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై 1995, జనవరి 11 వరకు ఆ పదవికి గౌరవాన్ని తెచ్చారు. చట్టసభల్లో ఆయన వినిపించిన ప్రతి ఉద్వేగభరిత, విషయ పరిజ్ఞానంతో కూడిన ప్రసంగం ప్రజల పక్షాన శ్రీపాద వాణిలో లభిస్తుంది. గోదావరి పరివాహక ప్రాంత రైతాంగం ఎదుర్కొన్న సాగునీటి తిప్పలు, ఉత్తర తెలంగాణ కరువు మండలాల రోదనలు, దళిత బహుజన, నిరుపేద వర్గాల ఆవేదనను, నిరుద్యోగం, నక్సలైట్ సమస్యలను సభ ముందు ఉంచడంలో ఆయన చూపిన ధైర్యం, తెగువను ఈ సంకలనం కళ్ళకు కడుతుంది. రూల్ బుక్‌ను క్షుణ్ణంగా ఔపోసన పట్టిన మేధావిగా సభా నిబంధనలకు సంపూర్ణంగా కట్టుబడుతూనే, ఎంతటి బలమైన ప్రభుత్వాలనైనా నిలదీసిన తీరు, పాయింట్ ఆఫ్ ఆర్డర్లు, రూలింగ్‌లపై ఆయన వెలువరించిన చారిత్రాత్మక తీర్పులు నేటికీ అసెంబ్లీ రికార్డుల్లో ప్రామాణికంగా నిలిచాయి.

మంథనితో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని చివరివరకు వీడని శ్రీపాదరావు, ఏప్రిల్ 13, 1999న 62వ ఏట నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యారు. కానీ, 'అర్ధరాత్రి తలుపు కొట్టినా స్పందించే నైజం' కలిగిన ప్రజానురంజక నాయకుడిగా, నిష్పాక్షిక స్పీకర్‌గా ప్రతిపక్షాల హక్కులకు అభయం ఇచ్చే రక్షణ కవచంలా ఇప్పటికీ ఆయన ప్రజల మనసులో నిలిచిపోయారు. శ్రీపాద రావు ప్రసంగాలకు అక్షర రూపమిస్తూ ఎమెస్కో అందిస్తున్న ఈ ప్రజల పక్షాన శ్రీపాద వాణి వర్తమాన శాసనసభ్యులకు, భవిష్యత్ యువ నాయకులకు, ప్రజాస్వామ్యంపై పరిశోధనలు చేసే విద్యార్థులకు ఒక దిక్సూచిగా నిలవనుందని పేర్కొన్నారు.

# ఆదిలాబాద్‌లో విషాదం

## ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ పట్టణంలో విషాదం నెలకొంది. స్థానిక మావల ప్రాంత ంలో గల ఎస్సీ స్టడీ సర్కిల్ భవ నం పై నుంచి ఓ నిరుద్యోగి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. మంచి ర్యాల జిల్లా కోటపల్లి ప్రాంతానికి చెందిన స్వామి రాం (26) డిగ్రీ చదివి ఉద్యోగం కోసం యత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఎస్సీ స్టడీ సర్కిల్ లో వుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు.

అయితే ఇటీవల హాజరైన పలు పరీక్షల్లో ఆశించిన మేర రాణించలేక పోవడంతో ఆ యువకు డు ఉదయం తొమ్మిది గంటలకు భవనం పైఅంతస్తు నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని అక్కడే వున్న తోటి విద్యార్థులు వెంటనే సమీపంలో ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. దీనిపై సమాచారం అందగానే మావల పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. స్వామిరాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యురీకి తరలించారు. దీనిపై మంచిర్యాలలోని అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

సాయంత్రం ఆరు గంటల సమయంలో స్వామిరాం తల్లిదండ్రులు ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం ఉదయం మృతుడి భౌతికకాయానికి పోస్టుమార్టం నిర్వ హించి అతని కుటుంబీకులు అప్పగిస్తామని మావల పోలీసులు తెలిపారు.

# ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

# బిసిల సమస్యలపై 10న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడానికి ఈ నెల 10న హైదరాబాద్ నగరంలో జాతీయ స్థాయి బిసి సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వం 8 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే ఈ ఫీజులు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన కొత్త విధానం బాగానే ఉంది కాని కళాశాలల యాజమాన్యాలకు ఫీజులు కట్టనిదే అడ్మిషన్‌లు ఇవ్వడం లేదని, డబ్బులు ఉన్నవారికే ఫీజులు కట్టించుకుని అడ్మిషన్‌లు ఇస్తున్నారని, ఫీజులు కట్టలేనివారి పరిస్థితి ఏమిటని?, వారు చదువుకోవద్దా? అందువల్ల యధావిధిగా ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఫీజుల పథకంపై ఏర్పడిన గందరగోళం వల్ల 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌కు హాజరు కాలేకపోయారని. అలాగే పిజి అడ్మిషన్లల్లో ముఖ్యంగా ఎంబిఎ, ఎంసిఎ అడ్మిషన్‌లో 50 శాతం సీట్లు భర్తీ కాలేదని, ఫీజులు కట్టెస్తోమత లేకపోతే కళాశాలల యాజమాన్యాలు అడ్మిషనలను ఇవ్వడం లేదన్నారు. ఆదే విధంగా డిగ్రీ కళాశాలల్లో కూడా 70 శాతం సీట్లుమిగిలిపోయాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం పాత పద్ధతిని కొనసాగించి, విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లపైన ఉన్న స్టేను తొలగించాలని, ప్రభుత్వం సీనియర్ న్యాయవాదులను నియమించి వాదింపజేయాలని, అవసరమైతే అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళి ప్రధానితో చర్చలు జరిపి శాశ్వత పరిష్కారం కోసం రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టడానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సమావేశానికి సంఘం జాతీయ నాయకుడు సి.రాజేందర్‌ముదిరాజ్ అధ్యక్షత వహించగా, సమావేశంలో బిసి నాయకులు జిల్లపల్లి అంజీ, నిఖిల్ పటేల్, అనంతయ్య, ప్రీతం, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్ డ్యాన్సర్ మాధురీరాథోడ్ ఆత్మహత్యాయత్నం

## ఫ్యాన్‌కు వేళ్లాడుతుండగా కాపాడిన కుటుంబసభ్యులు

## ఈశ్వర్‌సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో మనస్తాపం

**హైదరాబాద్ (నార్సింగి), సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** ఈశ్వర్‌సాయి పెళ్లి చేసుకుంటానని తనను మోసం చేశాడని, ఆయనపై తాను కేసు పెట్టినా పోలీసులు అరెస్టు చేయడం లేదని మనస్తాపం చెందిన ఫోక్ డ్యాన్సర్ మాధురీ రాథోడ్ గత నెల 26న ఆత్మ హత్యాయత్నం చేసింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పుప్పాలగూడలోని ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న మాధురీరాథోడ్ ఫోక్ డ్యాన్సర్‌గా పనిచేస్తూ మంచి పేరు తెచ్చు కుంది. ఈశ్వర్‌సాయితో కలిసి అనేక పాటల్లో నటించింది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య ప్రేమ వ్యవహారం నడిచింది. ఇటీవలో వీరిద్దరు ఓ హోటల్‌లో ఉండగా ఈశ్వర్‌సాయి భార్య పట్టుకొని విడియోలు తీసి సోషల్ మీడి యాలో పెట్టి ట్రోల్ చేసింది. దీంతో తన పరువుపోయిందని, ఈశ్వర్‌సాయి తనను పెళ్లి చేసుకుంటానని ఇప్పుడు మోసం చేశాడని, నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి ఈశ్వర్‌సాయి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు అతడిని పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఇంతలో మాధురీరాథోడ్ తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యా యత్నం చేసింది. సకాలంలో కుటుంబసభ్యులు గుర్తించి, తలుపులు బద్దలు కొట్టి ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆత్మహత్యాయత్నానికి ముందు తన కుటుంబ సభ్యులకు తన బాధను వ్యక్తంచేస్తూ ఫోన్‌కు మెసేజ్ చేసింది. ఆ మెసేజ్‌లో తనను ఈశ్వర్‌సాయి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని, ఎలాంటి తప్పు చేయకపోయినా మా విడియోలు సోషల్ మీడియాలో పెట్టి నా పరువు తీసిం దని, తాను ఈశ్వర్ సాయిపై కేసు పెట్టినా పోలీసులు అరెస్టు చేయలేదని, నేను ఏ తప్పు చేయలేదని, ఈశ్వర్‌సాయి,శరణ్య, సంధ్యల వలన నా కుటుంబం పరువు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులు మాధురీరాథోడ్‌కు అండగా నిలిచి, ధైర్యం చెబుతున్నారు. నార్సింగి పోలీసులు వెంటనే ఈశ్వర్‌సాయిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




మాధురీ రాథోడ్ (ఫైల్)

# రూ.354 కోట్లతో జ్ఞానసరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధి

## రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం : మంత్రి జూపల్లి



**నిర్మల్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు యేడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు.



## రాష్ట్రంలో ఇవి ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తరణ

### 369 పబ్లిక్ ఇవి ఛార్జింగ్ స్టేషన్లకు టెండర్లు

### పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఎండి ఫరూఖీ

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణలో ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (రెడ్కో) చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టీజీ రెడ్కో టెండర్లు పిలిచినట్లు ఆ సంస్థ ఎండి ముషారఫ్ ఫరూఖీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఇందులో హైదరాబాద్‌లో 200 స్టేషన్లు ఉన్నాయన్నారు. నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లను (డిసిపి) ఆహ్వానిస్తూ టెండర్లను జారీ చేసినట్లు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా దీర్ఘకాలికంగా, వాణిజ్య పరంగా నిలకడైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లో 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన డిసిపిలు సర్వే, డిజైన్, సరఫరా, సివిల్ వర్క్స్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్‌తోపాటు 10 సంవత్సరాలపాటు ఆపరేషన్ మెయింటెనెన్స్ నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు.

## దేశవ్యాప్తంగా 3,800 మంది చిన్నారులకు విముక్తి

### వివిధ రాష్ట్రాల్లో 575 ఎఫ్ఐఆర్‌లు నమోదు

### ముగిసిన రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఆపరేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా భారీ విజయం సాధించింది. జూన్ 12న ప్రారంభమై ఆగస్టు 31 వరకు కొనసాగిన ఈ ప్రత్యేక ప్యాన్‌ఇండియా రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ నుంచి 3,800 మందికి పైగా చిన్నారులను సురక్షితంగా రక్షించినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ చట్టబద్ధమైన సంస్థ, బాలకార్మికులుగా మారుతున్న వారిని, అక్రమ రవాణకు గురవుతున్న వారిని గుర్తించి రక్షించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, జిల్లా కలెక్టర్లు, కార్మిక శాఖలు, పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసింది. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడం ఎలా అనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, రెస్క్యూ అయిన పిల్లలకు సరైన పునరావాసం, విద్యను అందించడం ప్రాముఖ్యతను వివరించింది. ఈ నిరంతర పర్యవేక్షణ కారణంగా దేశవ్యాప్తంగా 3,800 మందికి పైగా చిన్నారులను కాపాడటమే కాకుండా, బాలకార్మిక వ్యవస్థకు పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా 575 పైగా కేసులు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



కిడ్నాప్ అయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసు కమిషనర్ సాయి చైతన్య.

## నిజామాబాద్‌లో బాలుడి కిడ్నాప్ ఉదంతం సుఖాంతం

### నిందితుల అరెస్టు.. తండ్రికి బాలుడి అప్పగింత

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో శనివారం ఉదయం మూడేళ్ల బాలుడి కి డ్నాప్ ఉదంతం సుఖాంతమయ్యింది. బాలుడిని కిడ్నాప్ చేసిన ఇద్దరిని 24 గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్టు చేయడంతో పాటు పసివా డిని తండ్రికికి అప్పగించారు. జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం సాయంత్రం మీడియాకు వె ల్లడించారు. వేదాన్ష్ అనే బాలుడిని శనివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో మాతా శిశు ఆసుపత్రి ప్రాంగణంలో ఒక మహిళ, మరో పురుషుడు కలిసి చాక్లెట్ ఆశచూపి కిడ్నాప్ చేయడం తెలిసిందే. తన భార్య కాన్పు కోసం ఒక వ్యక్తి ఆసుపత్రికి వచ్చిన సమయంలో అత ని కుమారుడైన వేదాన్ష్‌ను తండ్రి నుంచి దూరంగా వున్న సమయంలో కిడ్నాప్ చేశారు. దీనిపై ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసిన పోలీ సులు విచారణ చేబట్టారు. కిడ్నాపర్ల కోసం బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆటో స్టాండ్ల వద్ద గాలిం పు చేబట్టారు. సమీప పోలీసు స్టేషన్లను అ ప్రమత్తం చేశారు. జిల్లా సిసిఎస్ పోలీసులు గాలింపు చేబట్టగా ఆదివారం ఉదయం సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో కిడ్నాపర్లు పట్టుబడ్డారు. నిందితులిద్దరిని కోదాడి సుజా త (30), ఆమె భర్త కోదాడి యేల్లం (38)గా గుర్తించారు. వీరు కొంతకాలంగా మేడ్చల్‌లో వుంటున్నారు. వీరికి పి ల్లలు లేరు. ఈ పిల్లాడిని వీలైతే పెంచుకోవడం లేదా ఎవరికైనా అమ్మాలని వీరు నిర్ణయించుకున్నారని తేలింది. బాలుడితో పాటు కిడ్నాపర్లను దౌల్తాబాద్ నుంచి నిజామాబాద్‌కు తరలించారు. నిందితులను అరెస్టు చేయగా బాలుడిని అతని తండ్రికి అప్పగించారు. పసిపిల్లలను ఎక్కడికైనా తీసుకువెళ్లే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు జాగ్రత్తగా వుండాలని కమిషనర్ కోరారు.

# మంత్రుల ముఖాముఖితో సమస్యల పరిష్కార దిక్సూచిగా 'గాంధీభవన్'

### కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం దిశగా రెండేళ్లుగా కృషి

### ప్రజాసేవలో మహేశ్‌కుమార్ మరిన్ని మైలురాళ్లు చేరుకోవాలి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండేళ్లుగా తనదైన శైలిలో బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పనిచేస్తూ కొత్తకొత్త ఆలోచనలతో పార్టీని సంస్థాగత పటిష్టతకు వ్యూహాత్మ కంగా వ్యవహరిస్తున్నారు. మంత్రుల ముఖాముఖితో ప్రజల సమస్యల పరిష్కార దిక్సూచిగా గాంధీభవన్‌ను మలచడంలో ఆయన గత రెండేళ్లలో కృతార్థుడైనారు. ప్రతి బుధవారం సామాన్య ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా మొండి సమస్యల పరిష్కారం కోసం గాంధీభవన్‌వైపు ఆశగా చూస్తూ వస్తున్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ రెండే ళ్లగా పిసిసి అధ్యక్షుడిగా నూతన శైలితో తన మార్క్‌గా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు.

ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయానికి చర్యలు తీసుకొంటూ తెలంగాణ కాంగ్రెస్ రాజకీ యాల్లో పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ రెండేళ్ల ప్రస్థానం కొనసాగు తోంది. క్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. బిసి కులగణన, సామాజిక న్యాయం వంటి అంశాలకుటిపిసిసి ప్రాధాన్యం కల్పించింది. డిసిసిఅధ్యక్షుల నియామకాల్లో సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేయడం ద్వారా వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం జరిగిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా వరకు కాంగ్రెస్ కేడర్‌ను మరింత క్రియాశీలం చేయడంపై దృష్టి సారించారు. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్‌లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరాన్ని భారీ స్థాయిలో నిర్వహించడం పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రత్యేక కార్యక్రమంగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మహేష్‌కుమార్ గౌడ్ పనితీరును ప్రశంసించడం పార్టీ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాల్లో డిసిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా కార్యవర్గ సమావేశాలకు టిపిసిసి అధ్యక్షుడు స్వయంగా హాజరై నియామక పత్రాలు అందజేయడం ద్వారా పార్టీ రాష్ట్ర నాయకత్వం-జిల్లా నాయకత్వం మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావడంపై దృష్టి పెట్టారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాలు, పాదయాత్రలు పార్టీని ప్రజలకు మరింత చేరువ చేశాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం, నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, స్థానిక సంస్థల్లో సాధించిన విజయాలు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఎన్నికల విజయాలను సంస్థాగత బలంగా మలచడం, గ్రామ స్థాయిలో కేడర్‌ను మరింత పటిష్టం చేయడం మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వానికి ముందున్న ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

**సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబాటు: సిఎం రేవంత్‌రెడ్డి**

సామాన్య కార్యకర్త నుంచి పార్టీ రాష్ట్ర రథసారథి వరకు ఎదిగడంతోపాటు టిపిసిసి అధ్యక్షులుగా రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికపై ముఖ్యమంత్రి రెడ్డి ట్వీట్ చేశారు. బిసి బిడ్డకు తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించిన నిర్ణయం కేవలం ఒక పదవిని అప్పగించడం కాదు, సామాజిక న్యాయంపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని ముఖ్యమంత్రి కొనియాడారు..ఆ బాధ్యతను స్వీకరించిన నాటి నుంచి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో, పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ,మహేష్ కుమార్ గౌడ్ సాగిస్తున్న ప్రస్థానం అభినందనీయం అని ప్రశంసించారు. ఇదే అంకితభావంతో ప్రజాసేవలో మరిన్ని మైలురాళ్లు చేరుకోవాలని కోరుకుంటూ మహేష్ కుమార్ గౌడ్‌కి హృదయపూర్వక శుభాకాంక్షలు ముఖ్యమంత్రి తెలిపారు.

# 'సర్' పేరుతో బిజెపి ఓట్లను తొలగిస్తే సహించం

### రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసింది

### బిజెపి అధికారంలోకి వస్తే విద్యాబడ్జెట్ పెంపు

### ఖాళీలన్నీ వెంటనే భర్తీ చేస్తాం: పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ సమర్థ వంతమైన నాయకత్వం, ఆయన అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై యువత పెద్దఎత్తున బిజెపి వైపు వస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిఆర్‌ఎస్‌లో క్రియాశీల కంగా పనిచేసిన ఓబిసి, మున్నూరు కాపు యువజన నేతలు తమ బృందాలతో బిజెపిలో చేరారు. ఈ సంద ర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం లభిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎస్ఐఆర్ ద్వారా టార్గెటెడ్ ఓట్లు తొలగించి బిజెపి అధికారంలోకి రావాలని చూస్తోందని సిఎం అనడం పచ్చి హాస్యాస్పదమన్నారు. ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాతే కేరళలో ఎన్నికలు జరిగాయని, అక్కడ కాంగ్రెస్ పార్టీనే గెలిచినప్పుడు, ఈ ప్రక్రియను బిజెపి విజయాలతో ఎలా ముడిపెడతారని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ, భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే కుట్ర చేస్తోందని రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా సికిందరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బిజెపికి మద్దతు దారులుగా ఉన్న లక్షలాది మంది ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తుం డటంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నా యన్నారు. బిజెపి కీలక నాయకుల కుటుంబ సభ్యుల ఓట్లను కూడా టెక్నికల్ కారణాలు, నిబంధనల పేరుతో వేధిస్తూ నోటీసులు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్న బిఎల్‌ఓలంతా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని గుర్తుచేస్తూ, అధికార పార్టీ అక్రమ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ రాజ్యాంగబద్ధమైన విధులను పూర్తి నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కూడా ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పక్కా ఆధారాలతో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి న్యాయపరంగా పోరాడతామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యా వ్యవస్థ పూర్తిగా కుదేలైందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ



ముఖ్యమంత్రి వద్దే ఉన్నందున, రాష్ట్రంలో విద్యా రంగం దిగజారడానికి ముమ్మాటికీ సిఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో బిజెపి అధికారంలోకి రాగానే విద్యా బడ్జెట్‌ను గణనీయంగా పెంచుతామని, యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లోని అన్ని ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేస్తామని, పరిశోధనలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ విద్యా రంగాన్ని సమగ్రంగా బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్ర వాతావరణంలో తీవ్ర మార్పులు

### పగలు ఉక్కపోత.. రాత్రుళ్లు జల్లులు

### రాష్ట్రంలో విచిత్ర వాతావరణం

### సాధారణం మించి ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** తెలంగాణ వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుం టున్నాయి. వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా వేగంగా మారిపోతున్నాయి. బంగాళాఖాతం, అరేబియా సముద్రం ప్రాంతాల్లో గాలి దిశ మారడంతో రాష్ట్రంలో విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాల ప్రభావం తగ్గినట్టు కనిపిస్తున్నా, రాష్ట్రంలో పది రోజుల పాటు వాతావరణం భిన్నంగా ఉండబోతోందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో పగలు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నా సడెన్‌గా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మధ్యప్రదేశ్ పై భాగంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర అల్పపీడనం క్రమంగా పశ్చిమ వైపునకు పయనిస్తోంది.

దీంతో తెలంగాణపై దీని ప్రభావం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఫలితంగా రాష్ట్రంలో పొడి వాతావరణంతో పాటు, ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటోంది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లా తెల్దేవరపల్లిలో 39.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రలు నమోదు కాగా, అత్యధిక వర్షపాతం నిజామాబాద్ జిల్లా భీమగల్‌లో 30 మిల్లీమీటర్లు రికార్డయింది. ఇక గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని నిజామబాద్ జిల్లాలో 4.8 మిల్లీమీటర్లు, కరీంనగర్‌లో 4.6 మిల్లీమీటర్లు, జనగామలో 4.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. మరికొన్ని జిల్లాలు ఆసిఫాబాద్, పెద్దపల్లి, హన్మకొండ, వరంగల్ తదితర ప్రాంతాల్లో చెదురు మదరులు జల్లులు పడ్డాయి. మరోపక్క ఇదే సమయంలో రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో సాధారణం మించి 36.7 డిగ్రీలు, ఖమ్మంలో 36.9 డిగ్రీలు, కొత్తగూడెంలో 36.8 డిగ్రీలు, సూర్యాపేట్‌లో 36.1 డిగ్రీలు, గద్వేల్‌లోఓ 35.5 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 35.1 డిగ్రీలు, వనపర్తి జిల్లాలో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రలు నమోదయ్యాయి ఇక రాష్ట్రంలో జూన్ 1 నుండి ఇప్పటి వరకూ 611 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికి గాను, ఇంత వరకూ 479.4 మిల్లీమీటర్లు నమోదై 22 శాతం లోటు ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని 20 జిల్లాల్లోని 369 మండలాల్లో 20 శాతం నుండి 48 శాతం వరకూ లోటు ఏర్పడింది.

# దుబాయ్ బతుకమ్మ వేడుకలు.. కెటిఆర్‌కు ఆహ్వానం

### అక్టోబరు 11న జిటిఎఫ్, ఇటిసిఎ ఆధ్వర్యంలో వేడుకలు

### ఆహ్వాన పత్రిక అందజేసిన ప్రతినిధులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు6:** తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగను దుబాయ్‌లో ఘనంగా నిర్వహిం చేందుకు గల్ఫ్ తెలంగాణ ఫోరం (జిటిఎఫ్), ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (ఇటిసిఎ) ఏర్పాట్లు చేస్తున్నాయి. అక్టోబర్ 11న దుబాయ్‌లో నిర్వహిం చనున్న బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రవాస తెలం గాణ ప్రజలతో కలిసి సంబరాల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను నిర్వాహకులు ఆహ్వానించారు.

జిటిఎఫ్ ఫౌండర్, అధ్యక్షుడు ఆకుల సురేందర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేటీఆర్‌ను కలిసి దుబాయ్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసింది. తెలంగాణ ఆడపడుచులు, ప్రవాస తెలంగాణ కుటుంబాలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనాలని వారు కేటీఆర్‌ను ప్రత్యేకంగా కోరారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని గల్ఫ్ దేశాల్లోనూ కొనసాగించడంతో పాటు, అక్కడి తెలంగాణ సమాజంలో తమ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిటిఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

ముఖ్యంగా మహిళలు, యువత, చిన్నారులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

అక్టోబర్ 11న దుబాయ్‌లో జిటిఎఫ్ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించ నున్నారు. అనంతరం ఇటిసిఏ ఆధ్వర్యంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మరో బతుకమ్మ వేడుక జరగ నుంది. రెండు కార్యక్రమాల్లోనూ కేటీఆర్ పాల్గొంటారని మహేష్ బిగాల తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ బిగాల ఆధ్వర్యంలో దుబాయ్‌లో నిర్వహించ నున్న బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ప్రత్యేక ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. బతుకమ్మను కేవలం తెలంగాణలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు ఘనంగా జరుపుకుంటు న్నారని, గల్ఫ్ దేశాల్లోనూ ఈ పండుగకు విశేష ఆదరణ లభిస్తోందని ఆయన తెలిపారు. ప్రవాస తెలంగాణ సమాజం తమ స్వస్థలాలతో ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని కొనసాగించేందుకు బతుకమ్మ వేడుకలు ఒక వేదికగా నిలుస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో విజయరమణారావు కార్యాలయం ప్రారంభం

### పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు6:** అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ సి.విజయ రమణా రావు కార్యాలయాన్ని ప్రారంభించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఐటి, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

## బిసి సాధికారత సంస్థకు ప్రభుత్వ స్థలం కేటాయించాలి: మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్

### సాధ్యమైనంత మేరకు కృషి చేస్తా: పొన్నం


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు6:** సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం, వారిలో చైతన్యం ఐకమత్యం పెంచి, వారికి సాధికారత సాధించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన బీసీసీఇ (వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ) ఆదివారం కోఠిలోని కార్యాలయంలో దిగ్విజయంగా 12వ వార్షికోత్సవం నిర్వహించుకుంది. అయితే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. బీసీసీఈ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు తూళ్ల దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ.. వెనుకబడి తరగతుల సాధికార సంస్థకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని మంత్రిని కోరారు. తాను ఐదు కోట్ల రూపాయలు భవనం కట్టేందుకు అందిస్తానని అన్నారు.

అలాగే, సంస్థ ద్వారా సామాజిక అంశాలను దేశ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. బీసీసీఈ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు తూళ్ల దేవేందర్ గౌడ్ 26 పుస్తకాలను తెలుగులో ప్రచురించడంతో పాటు, సంస్థ ద్వారా సామాజిక అంశాలను దేశ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. బీసీసీఈ సంస్థకు స్థలం కేటాయింపు అంశాన్ని చైర్మన్ దేవేందర్ గౌడ్ తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయంలో ప్రభుత్వం తరఫున సాధ్యమైనంత మేరకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

## కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్

### కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారు:

### టిఆర్ఎస్ అధినేత్రి కవిత మండిపాటు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, సెప్టెంబరు6:** తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, డీజీపీకి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు, ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# విద్యుత్ కోతలతో పంటలకు అందని నీరు

### ఆందోళనలతో రోడ్డెక్కుతున్న అన్నదాతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు అన్నదాతలను విశ్రమించనీయడం లేదు. విద్యుత్ కోతలతో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వివిధ పంటలకు నీరు అందకపోవడంతో రైతులు వివిధ జిల్లాల్లో రోడెక్కి ఆందోళనలు చేస్తున్నారు. నిరంతర విద్యుత్ కోతలతో పొలాలకు నీళ్లు పెట్టుకోలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రోడ్డెక్కారు. ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో నారాయణ్‌పేట్ జిల్లాలోని మక్తల్ ట్యాంక్‌బండ్ వద్ద హైదరాబాద్-గద్వాల్ సర్కిల్ రోడ్డుపై రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంటపాటు రాస్తారోకో కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ మార్గం జాతీయ రహదారి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో సంగంబండ కెనాల్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారని రైతులు తెలిపారు. అయితే, కాలువల ద్వారా వచ్చిన నీటిని పొలాలకు పారించేందుకు అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో పంటలకు నీరు అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం వరి పంట గింజ గట్టిపడే దశలో ఉందని, ఈ సమయంలో పంటలకు నీరు అత్యవసరమని రైతులు పేర్కొన్నారు. విద్యుత్ కోతల కారణంగా చేతికొచ్చిన పంటలు కళ్లముందే నేలకొరిగే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే రోడ్డుపైకి వచ్చామని తెలిపారు. అలాగే రైతుల పంటలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం విద్యుత్ కోతలను నిరసిస్తూ సూర్యాపేట్ జిల్లా కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులోని సబ్ స్టేషన్‌ను రెండు రోజుల క్రితం రైతులు ముట్టడించారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. మొదట్లో 24 గంటలు ఇచ్చిన కరెంటును క్రమంగా 18, ఆ తర్వాత 13, నేడు ఏకంగా 9 గంటలకు కుదించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంతో పాటు కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, పొట్ట దశలో ఉన్న పంటకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

అనంతరం ఏడీఈ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. కాగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఇటువంటి విద్యుత్ సమస్యలపై రైతులు వినూత్న రీతిలో నిరసనలు తెలుపుతున్నారు.

కొన్ని చోట్ల సబ్‌స్టేషన్ల వద్దకు వెళ్లి కరెంట్ రావాలంటూ కొబ్బరికాయలు కొట్టడం, దిష్టిబొమ్మలు పెట్టడం, పూజలు చేయడం వంటి పద్ధతుల ద్వారా ప్రభుత్వానికి తమ బాధను విన్నవిస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### మహిళల జూ. ఆసియా కప్: మలేసియాను

# చిత్తుగా ఓడించిన భారత్



**మోకి :** చైనాలోని మోకిలో జరుగుతున్న ఎహెచ్‌ఎఫ్ జూనియర్ ఆసియా కప్ 2026లో భారత జూనియర్ మహిళల జట్టు తమ అద్భుతమైన ఆరంభాన్ని కొనసాగిస్తూ, ఆదివారం జరిగిన తమ రెండవ ఎలైట్ పూల్ మ్యాచ్‌లో మలేషియాపై 11-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఏడుగురు వేర్వేరు ఆటగాళ్లు గోల్స్ చేయగా, వాటిలో నాలుగు ఫీల్డ్ ప్లే నుండి, ఐదు పెనాల్టీ కార్నర్ల నుండి మరియు రెండు పెనాల్టీ స్ట్రోక్‌ల నుండి వచ్చాయి. తొలి నిమిషంలోనే పూజా సాహూ పెనాల్టీని గోల్‌గా మలచి స్కోరింగ్‌ను ప్రారంభించగా, పూర్ణిమా యాదవ్ (4వ నిముషం) గోల్ చేయడంతో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. బినీమా ధన్ (8వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచగా, కృష్ణ శర్మ (14వ) మరో గోల్ చేశాడు. రెండవ క్వార్టర్‌లో,పూర్ణిమ (17వ) మళ్ళీ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి తన రెండవ గోల్‌ను పూర్తి చేసింది. తదుపరి సుఖ్‌వీర్ కౌర్ (21వ)గోల్ చేయగా, గీతా యాదవ్ (28వ) గోల్ చేయడంతో భారత్ 7-0 ఆధిక్యంలో నిలిచింది. ఎట్టకేలకు మలేషియా ప్లేయర్ నూర్ మహ్మద్ (38వ) ఏకైక గోల్‌ను సాధించాడు. భారత్‌కు (42వ) మరో పెనాల్టీ లభించగా, పూజ ప్రశాంతంగా దానిని గోల్‌గా మలిచి తన బ్రేస్‌ను పూర్తి చేసుకుంది. ఆ తర్వాత సానికా చంద్రకాంత్ మానే (43వ) గోల్ చేయడంతో, చివరి క్వార్టర్‌లోకి ప్రవేశించే ముందు స్కోరు 9-1గా నిలిచింది. ఆఖర్లో గీత (53వ) మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి మ్యాచ్‌లో తన రెండో గోల్ సాధించగా, సానికా (58వ) మరోసారి గోల్ చేసి 11-1 తేడాతో ఘన విజయాన్ని పూర్తి చేసింది.

### పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్..

# ఇరాన్ చేతిలో భారత్ ఓటమి




**జపాన్:** ఏవీసీ పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ 2026లో రెండో గ్రూప్ మ్యాచ్‌లో ఇరాన్ చేతిలో భారత్ ఓటమి చెందింది. జపాన్‌లోని ఫుయోకాలో ఆదివారం జరిగిన వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. నాలుగుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఇరాన్ చేతిలో 20-25, 26-28, 18-25 తేడాతో ఓటమి పాలైన భారత జట్టు గ్రూప్ దశలో నాలుగో స్థానానికి పడిపోవడంతో, రెండో దశకు అర్హత సాధించడం మరింత కష్టమైంది. 12 జట్ల టోర్నమెంట్ మొత్తం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన 8 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. బలమైన ఇరాన్‌పై ఒక్క సెట్ కూడా గెలవడంలో భారత్ మరోసారి విఫలమవడంతో, జపాన్‌లో భారత్‌కు కష్టతరమైన ప్రయాణం కొనసాగింది. ఇరాన్ పటిష్టమైన రక్షణను ప్రదర్శించి భారత దాడి ఆటగాళ్లను కట్టడి చేసింది. ఇరాన్ జట్టు 16 కచ్చితమైన బ్లాక్‌లను నమోదు చేయగా, వాటిలో మిడిల్ బ్లాకర్ మహమ్మద్ వాలిజాదే ఐదు బ్లాక్‌లు చేశాడు. కాగా, భారత్ మ్యాచ్ మొత్తంలో కేవలం ఐదు బ్లాక్‌లను మాత్రమే చేయగలిగింది. చైనాతో జరిగిన గత మ్యాచ్ మాదిరిగానే, రెండో సెట్‌లో 22-19 ఆధిక్యంలో ఉన్న భారత్‌కు అవకాశాలు లభించినప్పటికీ, డ్యూస్‌కు నెట్టబడటంతో వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. జట్టు తదుపరి మంగళవారం నాడు తప్పక గెలవాల్సిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. ముందంజ వేసే అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్‌కు న్యూజిలాండ్‌పై స్ట్రెయిట్ సెట్స్‌లో విజయం అవసరం కావచ్చు.




### డైమండ్ లీగ్‌లో

# రుమేష్‌కు టైటిల్

### గాయంతో భారత్ అథ్లెట్ నీరజ్ నిష్క్రమణ

**బ్రస్సెల్స్:** శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేష్ తరంగ పతిరాగే ఆదివారం డైమండ్ లీగ్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. ఈ సీజన్ ఆయన కెరీర్‌లో ఒక అద్భుతమైన పురోగతికి నాంది పలికింది. ప్రపంచ నంబర్ 1 ర్యాంకర్ అయిన 23 ఏళ్ల ఈ క్రీడాకారుడు ఫైనల్‌లో తన మూడో ప్రయత్నంలో 89.04 మీటర్ల భారీ త్రో విసిరి విజయం సాధించాడు. పోలాండ్‌కు చెందిన డేవిడ్ వెగ్నర్ 87.47 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండవ స్థానంలో నిలవగా, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ కెషోర్న్ వాల్కాట్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన అయిన 83.99 మీటర్లతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆండర్సన్ పీటర్స్ 83.70 మీటర్లతో నాలుగవ స్థానంలో నిలిచాడు. అద్భుతమైన ప్రదర్శన తర్వాత పతిరాగే సర్క్యూట్ లీడర్‌గా ఫైనల్‌కు చేరుకున్నాడు.

రబాట్‌లో తన తొలి ప్రదర్శనలో రెండవ స్థానంలో నిలిచిన అతను, ఐదు డైమండ్ లీగ్ ప్రదర్శనలలో నాలుగు విజయాలు నమోదు చేశాడు. ఇక 2022 డైమండ్ లీగ్ ఛాంపియన్ అయిన భారతదేశానికి చెందిన నీరజ్ చోప్రా, ఓవరాల్ స్టాండింగ్స్‌లో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు, కానీ శిక్షణ సమయంలో చీలమండ స్నాయువు చిరగడంతో మిగిలిన సీజన్‌కు దూరమయ్యాడు, దీంతో అతను పోటీలో పాల్గొనలేదు.

### చైనా మాస్టర్స్‌లో

# సత్విక్-చిరాగ్ జోడీకి టైటిల్




**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్‌లో సత్విక్‌చిరాగ్ ఈ ఏడాది సత్తా చూపించారు. భారత స్టార్ డబుల్స్ జోడీ సత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టిలు ఆదివారం షెన్‌జెన్‌లో జరిగిన 2026 చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆతిథ్య జట్టుకు చెందిన హే జిటింగ్-రెన్ జియాంగ్యు జంటపై, ఈ ద్వయం ఒక గంట 10 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠ భరితమైన మూడుగేమ్‌ల పోరులో 11-21, 21-13, 21-17 స్కోరుతో పునరాగమనం చేసి విజయం సాధించింది. చైనా జంటపై తమ అజేయ రికార్డును కొనసాగించి, హెడ్‌టుహెడ్ ఆధిక్యాన్ని 3-0కి పెంచుకున్నారు. చైనా జంట మ్యాచ్‌ను బలంగా ప్రారంభించి, మొదటి ఐదు పాయింట్లను వరుసగా గెలుచుకుని 11-5తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించి తొలి గేమ్‌ను సునాయాసంగా ముగించారు. రెండవ గేమ్‌లో, సత్విక్-చిరాగ్ జోడీ దూకుడుగా షాట్లు ఆడుతూ, ఆధిక్యాన్ని అందుబాటులో ఉంచుకుంటూ మెరుగైన ఆరంభాన్ని అందుకొని, విరామ సమయానికి 11-7 ఆధిక్యాన్ని నెలకొల్పింది. నాణ్యమైన షాట్లతో ఆటపై ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశారు. చివరి 15 పాయింట్లలో 10 పాయింట్లను గెలుచుకున్నారు. నిర్ణయాత్మక గేమ్‌లో, చైనా జోడి మరోసారి బాగా ప్రారంభించి 7-4 ఆధిక్యం సాధించింది. అయితే, భారత్ జోడీ వారిని ఆధిక్యం పెంచుకోకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ, చైనా ద్వయం 11-9 స్వల్ప ఆధిక్యంతో చివరి ఎండ్స్‌లో ప్రవేశించి స్మాష్‌లతో ఆధిక్యాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించారు.

అయితే, సత్విక్-చిరాగ్ జోడీ ఒత్తిడిని కొనసాగించినా, చివరకు చైనా ఆటగాడి రిటర్న్ బేస్‌లైన్‌ను దాటి వెళ్లడంతో స్కోరును 16-16తో సమం చేశారు. ఆ తర్వాత, చైనా జోడీ తడబడి, అనేక అనవసర తప్పిదాలు చేయడంతో, భారత్ ద్వయం చివరి ఐదు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను సునాయాసంగా ముగించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు.





### యుఎస్ ఓపెన్.. డబుల్స్‌లో భాంబ్రి, అనిరుధ్

# డబుల్స్ జోడీ నిష్క్రమణ

**న్యూయార్క్:** భారత స్టార్ ఆటగాడు యూకీ భాంబ్రి, అతని న్యూజిలాండ్ భాగస్వామి మైఖేల్ వీనస్ న్యూయార్క్‌లో జరిగిన 2026 యూఎస్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూశారు. అలాగే మరో భారత్ ప్లేయర్ అనిరుద్ చంద్రశేఖర్-ఇవాన్ లియుటారెవిచ్ జోడీ కూడా పరాజయం చవిచూశారు. అమెరికాకు చెందిన ర్యాన్ సెగర్‌మాన్, పాట్రిక్ ట్రహాక్ జోడీతో గంటా 44 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన పోరులో యూకీ-మైఖేల్ జంట 6-7, 6-7 తేడాతో వరుస సెట్లలో ఓడిపోయింది. రెండు జంటలూ మొదటి సెట్‌లో పటిష్టమైన సర్వింగ్‌తో, బ్రేక్‌లు లేకుండా బలంగా ప్రారంభించి, టైబ్రేకర్‌కు దారితీశాయి. టైబ్రేకర్‌లో అమెరికన్ జంట ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో, ఇండోకివీ జోడి పుంజుకుని, ప్రత్యర్థి సర్వ్‌ను బ్రేక్ చేసి 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది, కానీ ఏడవ గేమ్‌లో వారు తమ సర్వ్‌ను కోల్పోవడంతో ఆ ఆధిక్యం రద్దయింది. దీంతో మ్యాచ్‌లో మరో టైబ్రేకర్ అనివార్యమైంది, అందులో కూడా అమెరికన్ జోడి పైచేయి సాధించి 7-3 తేడాతో గెలిచి, మ్యాచ్‌ను స్ట్రెయిట్ సెట్స్‌లో కైవసం చేసుకుంది.

ఇదిలా ఉండగా, భారత ఆటగాడు అనిరుధ్ చంద్రశేఖర్, అతని బెలారస్ భాగస్వామి ఇవాన్ లియుటారెవిచ్ కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో బ్రిటన్‌కు చెందిన ఆర్థర్ ఫెరీ, జాషువా పారిస్ జోడీ చేతిలో 4-6, 7-5, 4-6 తేడాతో వారు ఓడిపోయారు. దీంతో, 2026 యూఎస్ ఓపెన్‌లో ఇప్పుడు శ్రీరామ్ బాలాజీ మాత్రమే మిగిలిన ఏకైక భారతీయుడుగా నిలిచాడు.

### వార్ ఎఫెక్ట్, ముడిచమురు..

# ద్రవ్యోల్బణ డేటా కీలకం

### వచ్చే వారం మార్కెట్లకు ఇవే ఆధారం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, ముడిచమురు ధరల కదలికలు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రధానంగా ప్రభావితం చేయనున్నాయని మార్కెట్ నిపుణుల అంచనా. విదేశీ ఇన్వెస్టర్ల ట్రేడింగ్ కార్యకలాపాలు, అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు కూడా భారత ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ప్రపంచ ద్రవ్య విధానాలు, ముడిచమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా ఈ వారం మార్కెట్లు అత్యంత సున్నితంగా ఉండే అవకాశం ఉంది. అంచనాలను మించిన అమెరికా ఉపాధి గణాంకాలు వెలువడిన నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయంపై వాటి ప్రభావాన్ని ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.దేశీయంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహాలు, రూపాయి మారకం విలువ, ముడిచమురు ధరలు, దేశీయ లిక్విడిటీ పరిస్థితులను ఇన్వెస్టర్లు గమనిస్తారని ఆయన చెప్పారు.హార్ముజ్ జలసంధిలో చోటుచేసుకునే పరిణామాలు కూడా అత్యంత కీలకమైన అంశంగా మారనున్నాయని మిశ్రా పేర్కొన్నారు. ఈ పరిణామాలు భారత్‌లో ద్రవ్యోల్బణం, బాహ్య చెల్లింపుల సమతుల్యత, కంపెనీల లాభదాయకతపై ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్. మాట్లాడుతూ, అమెరికా ఇరాన్ మధ్య మళ్లీ తీవ్రత పెరగడం, హోర్ముజ్ జలసంధికి సంబంధించిన ఆందోళనలు ప్రపంచ ఇంధన మార్కెట్లలో భౌగోళిక రాజకీయ రిస్క్ ప్రీమియాన్ని పెంచాయని తెలిపారు. దీంతో గత వారంలో బ్రెంట్ క్రూడ్ ధర 8 శాతానికి పైగా, డబ్ల్యూటీఐ క్రూడ్‌ధర 9శాతానికి పైగా పెరిగిందన్నారు.

అంచనాలకుమించిన తాజా అమెరికా ఉద్యోగ గణాంకాలు ఆర్థికవ్యవస్థలో అంతర్లీన వృద్ధి బలంగా కొనసాగుతున్నట్లు సూచిస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు వెలువడనున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ల దృష్టి ఉంటుందని హెచ్‌ఎస్‌టి వెల్త్ వ్యవస్థాపకుడు, సిఇఒ హరిశెల్వన్ రాధాకృష్ణన్ తెలిపారు.

## ఈక్విటీలనుంచి రూ.8731కోట్లపెట్టుబడులు వెనక్కి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:** విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు ఈనెల 4తో ముగిసిన వారంలో భారత ఈక్విటీల్లో ఎక్కువ విత్‌డ్రాచేసారు. మొత్తం రూ.8,731.33 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా రెండు నెలల పాటు కొనుగోళ్లు జరిపిన అనంతరం ఎఫ్‌పీఐలు మళ్లీ విక్రయాల బాట పట్టారు. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ గణాంకాల ప్రకారం గత వారం ఐదు ట్రేడింగ్ సెషన్లలో మూడు సెషన్లలో ఎఫ్‌ఐఐలు ఎక్కువ విత్‌డ్రాచేసారు. ఆగస్టు 31న జరిగిన త్రైమాసిక ఎంఎస్‌సిఐ ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్ సెషన్ కూడా ఇందులో ఉంది. అదే సమయంలో దేశీయ సంస్థాగత మదుపుదారులు మొత్తం ఐదు సెషన్లలోనూ నికర కొనుగోలుదారులుగా ఉన్నారు'అని బజాజ్ బ్రోకింగ్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్‌రిసెర్చ్ పబిత్రో ముఖర్జీ తెలిపారు.ప్రపంచ చమురు ధరల పెరుగుదలతో పాటు అమెరికాఇరాన్ మధ్య మారుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్కెట్లలో అస్థిరత నెలకొందని ఆయన పేర్కొన్నారు.ఎఫ్‌పీఐల విక్రయాల్లో అత్యధికంగా సెప్టెంబర్ 1న రూ.5,432.83 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. అనంతరం సెప్టెంబర్ 3న రూ.953.84 కోట్లు, సెప్టెంబర్ 4న రూ.2,820.66 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. సెప్టెంబర్ 2న ఎఫ్‌పీఐలు బయ్యర్లుగా మారి రూ.1,764.20 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అంతకుముందు ఆగస్టు 31న వారపు ట్రేడింగ్ ప్రారంభమైన రోజే రూ.1,288.20 కోట్ల నికర ఉపసంహారణ జరిగింది. ఎన్‌ఎస్‌డీఎల్ ట్రాక్ చేసే అన్ని ఆస్తి విభాగాలను పరిగణనలోకి తీసుకుంటే ఈక్విటీలు, డెట్, హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, మ్యూచువల్ ఫండ్లు, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు (ఏఐఎఫ్‌లు) ఎఫ్‌పీఐలు వారంలో మొత్తం రూ.11,620.81 కోట్ల నికర విత్‌డ్రాలు చేశారు.

డెట్ విభాగంలో ఎఫ్‌పీఐల నికరంగా రూ.443.80 కోట్లువిత్‌డ్రాఅయితే జనరల్ లిమిట్ విభాగంలో రూ.311.51 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. వాలంటరీ రిటెన్షన్ రూట్ (వీఆర్ఆర్) నుంచి రూ.15.99 కోట్లు, ఫుల్లీ యాక్సెసిబుల్ రూట్ (ఎఫ్ఏఆర్) నుంచి రూ.739.32 కోట్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి.హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్ల విభాగంలో వారానికి రూ.2,545.15 కోట్ల నికర ఔట్‌ఫ్లో నమోదైంది. ముఖ్యంగా సెప్టెంబర్ 3న ఒక్కరోజే రూ.3,451.63 కోట్ల భారీ ఉపసంహారణ జరిగింది.మ్యూచువల్ ఫండ్ల విభాగంలో రూ.99.47 కోట్ల నికర ఇన్‌ఫ్లో నమోదైంది.


# 11 ఐపిఒలతో 7055 కోట్లు సమీకరణ టార్గెట్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** భారత ప్రైమరీ మార్కెట్‌లో మరోసారి ఐపిఒల సందడి నెలకొననుంది. మొత్తం 11 మెయిన్‌బోర్డ్ కంపెనీలు ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ)ల ద్వారా రూ.7,055 కోట్లను సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఐపిఒలు ఈనెల 7 నుంచి 15 మధ్య మార్కెట్‌లోకి రానున్నాయి. వీటిలో ఎక్కువ భాగం మంగళవారం, బుధవారం సబ్‌స్క్రిప్షన్‌కు వస్తాయి. లిస్టింగ్ సమయానికి ఈ కంపెనీలన్నింటి మార్కెట్ క్యాపిటలైజేషన్ 1 బిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండనుండటంతో, ప్రారంభ దశలోనే వృద్ధి సామర్థ్యం ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని ఎస్ సెక్యూరిటీస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాజ్‌కుమార్ రాథీ తెలిపారు. ఒకేసారి ఇన్ని కంపెనీలు ఐపీఓలకు రావడం ప్రైమరీ మార్కెట్‌లో ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఇంజినీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు, పేమెంట్స్ మరియు ఐడెంటిటీ సొల్యూషన్స్ సంస్థ, స్పెషాలిటీ కెమికల్స్ తయారీదారు, ఆన్‌లైన్ రెంటల్ ప్లాట్‌ఫామ్ తదితర రంగాలకు చెందిన కంపెనీలు ఈసారి మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నాయి.మొత్తం రూ.7,055 కోట్లలో రూ.2,722 కోట్లు (39 శాతం) కంపెనీలకు నేరుగా వెళ్లే ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరిస్తారు. మరో రూ.4,333 కోట్లు (61 శాతం) ఇప్పటికే ఉన్న వాటాదారులు తమ వాటాలను విక్రయించడం అంటే ఒఎఫ్ఎస్ ద్వారా సమీకరించనున్నారు. ఇది భారత ప్రైమరీ మార్కెట్‌పై కార్పొరేట్ సంస్థలకు ఉన్న బలమైన విశ్వాసాన్ని, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సమృద్ధిగా ఉన్న లిక్విడిటీని ప్రతిబింబిస్తోందని రాథీ పేర్కొన్నారు.ఫ్రెష్ ఇష్యూల ద్వారా సమీకరించిన నిధులను ప్రధానంగా వ్యాపార విస్తరణ, మూలధన వ్యయాలు, రుణాల చెల్లింపు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇతర సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు.సెప్టెంబర్ ఇప్పటికే రేస్ ఆఫ్ బిలీఫ్, దీపా జ్యువెలర్స్ సంస్థలు తమ ఐపిఒలను ప్రారంభించాయి. వీటితో కలిపి 2026లో ఐపిఒలకు వచ్చిన కంపెనీల సంఖ్య 75కు చేరనుంది. ఈ నేపథ్యంలో 11 కంపెనీల్లో ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ 7న పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్‌కు తెరుచుకోనుంది. రూ.351 కోట్లకు పైగా విలువైన ఈ ఇష్యూ 9న ముగుస్తుంది. 8న కనోహర్ ఎలక్ట్రికల్స్, ప్రసోల్ కెమికల్స్, గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపిఒలు ప్రారంభమవుతాయి. సెప్టెంబర్ 9న రెంటోమోజో, మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, ఆర్సిల్, ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్, కరమ్తూరా ఇంజినీరింగ్, స్టీమ్‌హౌస్ ఇండియా ఐపీఓలు ప్రారంభమవుతాయి. 10న వీగాలాండ్ డెవలపర్స్ ఐపిఒ ప్రారంభమవుతుంది. ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్: ఒక్కో షేరుకు రూ.118-124 ధర శ్రేణిని నిర్ణయించింది.కనోహర్ ఎలక్ట్రికల్స్ రూ.1,056 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.601-632 ధర శ్రేణిని నిర్ణయించింది.ప్రసోల్ కెమికల్స్ రూ.500 కోట్ల ఐపీఓకు రూ.643-676 ధర శ్రేణిని నిర్ణయించింది. గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా): రూ.428 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.172-182 ధర శ్రేణిని నిర్ణయించింది.రెంటోమోజో: రూ.1,256 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.384-404 ధర శ్రేణిని నిర్ణయించింది. కరమ్తూరా ఇంజినీరింగ్ రూ.875 కోట్ల ఐపీఓలో ధరలు రూ.241-254గా ఉంటాయి. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ రూ.805 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.322-339 ధర శ్రేణిని నిర్ణయించింది. ఆర్సిల్: రూ.733 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.132-139 ధర శ్రేణిని నిర్ణయించింది. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ రూ.427 కోట్ల ఐపీఓకు ఒక్కో షేరుకు రూ.139-146 ధర శ్రేణిని నిర్ణయించింది. స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల ఐపిఒకు వస్తుంటే వీగాలాండ్ డెవలపర్స్ షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లను సమీకరించనుంది.


### పశ్చిమాసియా వార్‌తో ఆహారోత్పత్తుల

# ధరలకు మళ్లీ రెక్కలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** నాలుగేళ్ల తర్వాత గరిష్ఠ స్థాయికి ఎఫ్ఏఓ ఆహార ధరల సూచీ చేరింది. తీవ్ర వాతావరణ పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య మార్గాల్లో నిరంతర అంతరాయాల కారణంగా కీలక వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాపై ఆందోళనలు పెరగడంతో ఆహార ధరలు 2022 చివరి నాటి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఐక్యరాజ్యసమితి పరిధిలోని అంతర్జాతీయంగా వర్తకం జరిగే వివిధ ఆహార ఉత్పత్తుల ధరల్లో నెలవారీ మార్పులను పర్యవేక్షించే ఎఫ్ఎవో ఆహారోత్పత్తుల సూచీ ఆగస్టులో సగటున 133.3 పాయింట్లకు చేరుకుంది. జూలైలో నమోదైన సవరించిన 130.8 పాయింట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల.ధాన్యాల ధరల సూచీ ఆగస్టులో గత నెలతో పోలిస్తే 2.2 శాతం పెరిగి, 2024 మే తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. వంటనూనెల ధరల సూచీ కూడా 0.6 శాతం పెరిగి, 2022 జూన్ తర్వాత గరిష్ఠ స్థాయిని తాకింది.ఆగస్టు సూచీ 2022 నవంబర్ తర్వాత అత్యధికమైనదిగా నమోదైంది. అయితే 2022 మార్చిలో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి ప్రారంభించిన తర్వాత నమోదైన రికార్డు స్థాయితో పోలిస్తే ఇప్పటికీ దాదాపు 17 శాతం తక్కువగానే ఉంది.ఎఫ్ఎవో ప్రధాన ఆర్థికవేత్త మాక్సిమో టొరెరో మాట్లాడుతూ ప్రపంచ ఆహార ధరలలో ఆగస్టు పెరుగుదల ఆహార మార్కెట్లలో సరఫరా ప్రమాదాల ప్రభావం మళ్లీ పెరుగుతోందనడానికి హెచ్చరిక అని అన్నారు. వాతావరణ విపత్తులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య రవాణా వ్యవస్థల్లో అంతరాయాలు ఒకేసారి చోటుచేసుకోవడం వల్ల సరఫరాపై అంచనాలు కఠినంగా మారుతున్నాయనిపేర్కొన్నారు. ఆగస్టులో ధాన్యాలు,వంటనూనెలు, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు అన్ని ప్రధాన ఆహార విభాగాల ధరలు పెరిగాయి. ధాన్యాల ధరలు మూడేళ్ల గరిష్ఠానికి చేరుకోగా, చక్కెర ధరలు యేడాదికిపైగా కాలంలో అత్యధిక స్థాయికి చేరాయి.ప్రధాన ఆహార విభాగాల్లో చక్కెర ధరలే అత్యధికంగా 11.9 శాతం పెరిగాయి. దీంతో చక్కెర బెంచ్‌మార్క్ ధర 2025 జూన్ తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. బ్రెజిల్‌లోని కీలక సెంటర్‌సౌత్ ప్రాంతంలో ఉత్పత్తి తగ్గడం, యూరప్, ఆసియాలో ప్రతికూల వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు చక్కెర ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. వాతావరణం, యుద్ధాలతో సరఫరాకు దెయ్యూరప్‌లో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువు పరిస్థితులు మొక్కజొన్న, షుగర్ బీట్ పంటల దిగుబడులతో పాటు పశుసంపద ఉత్పత్తిపైనా ఆందోళనలు పెంచాయి.

## ఆర్థిక పరిస్థితులవల్లే జెట్ ఎయిర్‌వేస్ సంక్షోభం: నరేశ్ గోయల్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** జెట్ ఎయిర్‌వేస్‌లో తలెత్తిన ఆర్థిక సంక్షోభానికి ప్రతికూల స్థూల ఆర్థిక పరిస్థితులే కారణమని, తన వైపు ఎలాంటి మోసపూరిత చర్యలు జరగలేదని సంస్థ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ కోర్టుకు సమర్పించిన డిశ్చార్జ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ పిటిషన్‌ను వ్యతిరేకించింది. గోయల్ ఒక వ్యవస్థీకృత మోసానికి రూపకల్పన చేసి, దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థను ఆర్థికంగా కుప్పకూలేలా చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను మోసం చేసి, సంక్లిష్టమైన అంతర్జాతీయ మనీలాండరింగ్ నెట్‌వర్క్ ద్వారా తనకు, తన కుటుంబానికి లబ్ధి చేకూర్చుకున్నారని ఆరోపించింది. 2019లో జెట్ ఎయిర్‌వేస్‌కు ఇచ్చిన రుణాల్లో రూ.538.62 కోట్లను దారి మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై ఇడి గోయల్‌ను 2023 సెప్టెంబర్‌లో అరెస్టు చేసింది.ప్రస్తుతం వైద్య కారణాలతో బెయిల్‌పై ఉన్న 77యేళ్ల గోయల్ జెట్ ఎయిర్‌వేస్ తన నియంత్రణకు అతీతమైన ప్రతికూల స్థూల ఆర్థిక పరిస్థితుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుందని తెలిపారు. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడం, విదేశీ మారకద్రవ్య మార్కెట్లలో అస్థిరత, తీవ్రమైన పోటీ వంటి అంశాలు సంస్థ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశాయని పేర్కొన్నారు.పెరుగుతున్న ఆర్థిక బాధ్యతలను తీర్చలేని పరిస్థితుల్లో 2019 ఏప్రిల్‌లో విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. అయితే ఈ పరిస్థితికి పూర్తిగా ప్రతికూల మార్కెట్ పరిస్థితులే కారణం. దరఖాస్తుదారు (గోయల్) లేదా సంస్థ యాజమాన్యంలోని ఇతర సభ్యుల ఎలాంటి మోసపూరిత చర్యల వల్ల ఇది జరగలేద అని పేర్కొన్నారు. జెఐఎల్ ఆర్థిక సంక్షోభం వాణిజ్య, విమానయాన రంగ పరిస్థితుల ఫలితమే తప్ప మనీలాండరింగ్‌కు ఆధారం కాదని గోయల్ స్పష్టం చేశారు. టికెట్ల విక్రయాలు, కొత్త మార్కెట్ల విస్తరణ కోసం జీఎస్ఎల సేవలను వినియోగించడం విమానయాన రంగంలో సాధారణ విధానమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. జీఎస్ఏలకు సంబంధించిన అన్ని చెల్లింపులను జెఐఎల్ బోర్డు ఆమోదించిందని, వాటిని ఆర్థిక నివేదికల్లో వెల్లడించామని తెలిపారు. కెనరా బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.538.62 కోట్ల రుణాన్ని దారి మళ్లించారన్న ఆరోపణపైనా గోయల్ వివరణ ఇచ్చారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.